STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 127 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 21 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



సీఈసీ, ఈసీ నియామక చట్టంపై
విస్తృత విచారణ


- ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి బాధ్యత
- రీకాల్ పిటిషన్‌పై విడిగా విచారణకు నిరాకరణ
- జస్టిస్ శర్మ పదవీ విరమణపై సీజేఐ స్పష్టత

4

సంస్కృతుల కలయికే..
ప్రపంచ శాంతికి రక్ష

- దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడులతో సంబంధాలు బలోపేతం
- షాంఘై సహకార సంస్థ నాగరికతల సంభాషణ వేదికలో ప్రధాని మోదీ

4



ధరల కట్టడికి ఏడాది కార్యాచరణ

మార్కెట్ జోక్యానికి నెలకు
రూ.100 కోట్లు ఖర్చు

వచ్చే నెల 1 నుంచి రేషన్‌లో
కందిపప్పు, పామాయిల్

- బియ్యం పక్కదారి పట్టకుండా విజిలెన్స్ నిఘా
- నిత్యావసరాల సమీక్షలో సీఎం చంద్రబాబు



వివరాలు 2లో..



ఉద్యాన రైతులను ఆదుకోండి

రెండు తుఫాన్లతో రూ.1,092 కోట్ల మేర పంట నష్టం

- పునరుద్ధరణకు రూ.96.33 కోట్ల అదనపు సాయానికి వినతి
- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ

2



సెన్సార్లతో రొమ్ము క్యాన్సర్ పరీక్షలు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

2


ఐపీవోకు ఏపీఎండీసీ..
సీఎం ఆమోదం

- త్వరలో ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
- గనుల శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు



.. వివరాలు 2లో

"నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న సామాన్యుడికి ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణకు ఏడాది కాలానికి పక్కా కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వచ్చే నెల 1 నుంచి రేషన్ షాపుల్లోనే కిలో రూ.100కు కందిపప్పు, రూ.25కు గోధుమ పిండి, లీటర్ రూ.125కు పామాయిల్ విక్రయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ధరల కట్టడికి నెలకు రూ.100 కోట్లు వెచ్చిస్తున్నామని, రైతుకు నష్టం రాకుండా.. వినియోగదారుడికి కష్టం కలగకుండా నిరంతర నిఘా పెట్టాలని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షలో సీఎం స్పష్టం చేశారు."



తీరం దాటిన 'అక్వాన్'

3

- గోపాల్‌పూర్ వద్ద 70ఉ90 కి.మీ. వేగంతో గాలులు
- ఉత్తరాంధ్రలో తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన
- శ్రీకాకుళం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- అత్యవసర సాయానికి 'మనమిత్ర' వాట్సాప్ నంబర్

రామాయపట్నం పోర్టు మా
దార్శనికతే



3

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి
- కస్టమ్స్ పోర్టుగా సీబీఐసీ నోటిఫికేషన్‌పై హర్షం
- దావోస్ నుంచి సీఐఐ వరకు మా పోర్టులనే చూపిస్తున్నారని ఎద్దేవా

అదే రోజు స్పందనే మా
'టాప్ సీక్రెట్'!

- తమిళనాడు 'గైడెన్స్' సమాచార లీక్ ప్రచారంపై లోకేశ్ స్పందన
- మా పెట్టుబడి వ్యూహాన్ని ఎవరైనా కాపీ చేసుకోవచ్చని ట్వీట్
- పొరుగు రాష్ట్రాల సమాచారం మాకు అవసరం లేదని స్పష్టత

3





జడ్పీ పీఠాలపై కూటమి హవా

- 28 జిల్లాల్లో 27 స్థానాలు కైవసం
- టీడీపీకి 22 చైర్మన్, 20 వైస్ చైర్మన్ పదవులు
- ఒక్క అల్లూరి జిల్లాకే పరిమితమైన వైసీపీ

జనసేన కోటాలో 8 మంది మహిళలకు అవకాశం

వివరాలు 3లో..

పీఎం స్వనిధిలో ఏపీకి
ఏడు అవార్డులు

రాష్ట్రస్థాయిలో మూడు.. పట్టణ సంస్థలకు నాలుగు



- ప్రత్యేక ప్రచార కార్యక్రమాల నిర్వహణలో తొలి స్థానం
- రుణాల పంపిణీ, డిజిటల్ లావాదేవీల్లో జాతీయ గుర్తింపు
- మెప్మా బృందానికి మంత్రి నారాయణ అభినందనలు

వివరాలు 2లో..

మెప్మా అవార్డులపై మంత్రి నారాయణ
హర్షం

2



స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- అధికారులకు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆదేశం
- ఆక్వా తుపాను ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు

వివరాలు 3లో..


ఉద్యాన రైతులను ఆదుకోండి

రెండు తుఫాన్లతో రూ.1,092 కోట్ల మేర పంట నష్టం

పునరుద్ధరణకు రూ.96.33 కోట్ల అదనపు సాయానికి వినతి

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ

అమరావతి, నవంబర్ 20 (సమయం న్యూస్) : రెండు వరుస తుఫాన్ల కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద రూ.96.33 కోట్ల అదనపు సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫాన్ల ధాటికి రాష్ట్రంలో ఉద్యాన పంటలకు రూ.1,092 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లిందని ఆయన లేఖలో వివరించారు. అక్టోబర్ 28, నవంబర్ 2 తేదీల్లో వరుసగా ఏపీని తాకిన ఈ రెండు తుఫాన్లతో 18 జిల్లాల్లోని 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, 71,576 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. అర్నబ్ తుఫాను కారణంగా 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లగా, అందులో ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో దెబ్బతిందని తెలిపారు. అలాగే మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో ఉద్యాన పంటలు నష్టపోయినట్లు వివరించారు.



అత్యధికంగా దెబ్బతిన్న అరటి పంట పునరుద్ధరణ కోసం మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద హెక్టారుకు రూ.44 వేల చొప్పున నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఎండుమిర్చి, కూరగాయల రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల తదితర జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు నుంచి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. తోటల పునరుద్ధరణతో పాటు రైతులకు దీర్ఘకాలిక ఆర్థిక నష్టాలను తగ్గించేందుకు త్వరితగతిన సాయం అందించాలని చంద్రబాబు తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

సెన్సార్లతో రొమ్ము క్యాన్సర్ పరీక్షలు

బీపీసీఎల్ సాయంతో రూ.56 కోట్ల విలువైన 750 ఐబ్రెస్ట్ పరికరాలు

దేశంలోనే తొలిసారిగా గ్రామస్థాయిలో లక్షలాది మందికి స్క్రీనింగ్

తొలి విడతగా 13 జిల్లాలకు 375 పరికరాల పంపిణీ పూర్తి

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



గుంటూరు, నవంబర్ 20 (సమయం న్యూస్) : రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు రాష్ట్రంలో సెన్సార్ల ఆధారంగా పనిచేసే ఆధునిక పరీక్షా విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఎన్‌సీడీ కార్యక్రమం కింద ఇటీవల చేపట్టిన సర్వే ముగిసిందని, దీనికి కొనసాగింపుగా త్వరలో కొత్తగా బీపీ, మధుమేహం, ఓరల్, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయిలో లక్షలాది మంది మహిళలకు 'ఐబ్రెస్ట్ ఎగ్జామ్' పరికరాలతో పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లోనే మహిళల ఇళ్ల వద్ద లేదా విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఈ పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఐబ్రెస్ట్ ఎగ్జామ్ పరికరాల వినియోగంపై శిక్షణ పొందిన మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, అధికారులతో మంత్రి చర్చించారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతిక పరిజ్ఞాన వినియోగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ఈ క్రమంలోనే వైద్యారోగ్య శాఖ మెడ్‌టెక్ ఛాలెంజ్ ద్వారా కృత్రిమ మేధ ఆధారిత వైద్య సేవలను ప్రజలకు అందించి అంతర్జాతీయ గుర్తింపు సాధించిందని మంత్రి పేర్కొన్నారు.

సెన్సార్లతో కణుతుల గుర్తింపు ఇలా..

ప్రస్తుతం వైద్య సిబ్బంది చేతులతో పరీక్షించి రొమ్ములో కణుతులను గుర్తిస్తున్నారు. యూఈ లైఫ్‌సైన్సెస్ సంస్థ అభివృద్ధి చేసిన ఐబ్రెస్ట్ ఎగ్జామ్ (ఐబీఈ) చేతితో పట్టుకునే చిన్న పరికరం. ఇందులో డైనమిక్ కోఉప్లానర్ కెపాసిటివ్ సెన్సార్ సాంకేతికతను ఉపయోగిస్తారు. బ్యాటరీ, వైర్‌లెస్ సౌకర్యంతో పనిచేసే ఈ పరికరాన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు. దీనిని రొమ్ము పైభాగంలో ఉంచగా, అందులోని ప్రత్యేక ఎలక్ట్రానిక్ సెన్సార్లు కణజాలంలోని మార్పులను అంచనా వేస్తాయి. పరీక్ష పూర్తయిన వెంటనే ప్రత్యేక మొబైల్‌లో రంగుల రూపంలో డిజిటల్ ఫలితాలు కనిపిస్తాయి. అసాధారణ మార్పులు గుర్తించిన మహిళలను తదుపరి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రులకు పంపిస్తారు.

రూ.56 కోట్లతో 750 పరికరాలు

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సామాజిక బాధ్యత నిధుల కింద 750 ఐబ్రెస్ట్ ఎగ్జామ్ పరికరాలను వైద్యారోగ్య శాఖకు అందించేందుకు అంగీకరించింది. ఒక్కో పరికరం విలువ సుమారు రూ.7.5 లక్షలు కాగా, మొత్తం వ్యయం రూ.56 కోట్లు. ఈ మేరకు బీపీసీఎల్‌తో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఒప్పందం చేసుకున్నారు. బీపీసీఎల్ నిధులతో హెచ్‌ఎల్‌ఎల్ ఇన్‌ఫ్రా టెక్ లిమిటెడ్ (హైట్స్) వీటిని కొనుగోలు చేసి అందిస్తోంది. రాష్ట్రంలో ఈ పరికరాల పంపిణీని రెండు విడతల్లో చేపడుతున్నారు. ఇప్పటికే తొలి విడతగా అందిన 375 పరికరాలను 13 జిల్లాలకు పంపిణీ చేసి, ఆయా జిల్లాల్లోని మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. రెండో విడతలో మిగిలిన 375 పరికరాలను ఇతర జిల్లాలకు పంపిస్తారు. గ్రామాల జనాభా ఆధారంగా మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు అందుబాటులో ఉన్న ప్రాంతాలకు వీటిని కేటాయిస్తామని అధికారులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు.

ధరల కట్టడికి ఏడాది కార్యాచరణ

- **మార్కెట్ జోక్యానికి నెలకు రూ.100 కోట్లు ఖర్చు**
- **వచ్చే నెల 1 నుంచి రేషన్‌లో కందిపప్పు, పామాయిల్**
- **బియ్యం పక్కదారి పట్టకుండా విజిలెన్స్ నిఘా**
- **నిత్యావసరాల సమీక్షలో సీఎం చంద్రబాబు**

అమరావతి, నవంబర్ 20 (సమయం న్యూస్) : నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ, మార్కెట్ జోక్యంపై ఏడాది కాలానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సమస్య తలెత్తినప్పుడే కాకుండా ధరల పెరుగుదలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రతి వారం అధికారులు సమీక్షించాలని స్పష్టం చేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిత్యావసరాల ధరల నియంత్రణపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పంట పండించిన రైతుకు నష్టం రాకూడదని, వినియోగదారుడికి కష్టం కలగకూడదని, ఆ దిశగా వ్యవసాయం, మార్కెటింగ్, పౌర సరఫరాలు, రైతు బజార్ల విభాగాలు సమన్వయంతో పనిచేసి ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయాలని దిశానిర్దేశం చేశారు.

రేషన్ షాపుల్లో తక్కువ ధరకే సరుకులు

వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకే నిత్యావసరాలను విక్రయించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. కిలో కందిపప్పు రూ.100, గోధుమ పిండి రూ.25, లీటర్ పామాయిల్ రూ.125 చొప్పున సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతు బజార్లలో కిలో రూ.35కే ఉల్లి విక్రయాలు కొనసాగుతున్నాయని, 'ధరణి' బ్రాండ్ పేరిట అందిస్తున్న బియ్యానికి మంచి డిమాండ్ ఏర్పడిందని చెప్పారు. బహిరంగ మార్కెట్లోనూ బియ్యం ధరలను అదుపులో ఉంచేందుకు హోల్‌సేల్ డీలర్లు, మిల్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, మొబైల్ వాహనాల ద్వారా కూడా తక్కువ ధరకు బియ్యం అందించేందుకు సిద్ధమవుతున్నామని అధికారులు వివరించారు.



ఖర్చుకు వెనుకాడొద్దు.. సాగు ప్రోత్సాహం

ధరలను అదుపులోకి తెచ్చేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద ప్రభుత్వం ప్రస్తుతం నెలకు రూ.100 కోట్ల వరకు వెచ్చిస్తోందని గుర్తుచేసిన చంద్రబాబు.. ప్రజల కోసం చేసే ఈ ఖర్చు విషయంలో ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. అవసరానికి తగ్గట్టుగా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తే బహిరంగ మార్కెట్లో ధరలు తగ్గుతాయని, ఇందులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని హెచ్చరించారు. నిరంతరం 'మార్కెట్ వాచ్', 'అగ్రీ వాచ్' ద్వారా వ్యూహాత్మకంగా వ్యవహరించాలని నిర్దేశించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా రాష్ట్రంలో కంది సాగును ప్రోత్సహించాలని, నాసిక్ రకం ఉల్లిపాయల సాగుకు అనువైన ప్రాంతాలను అధ్యయనం చేసి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

కూరగాయలపైనా దృష్టి.. విజిలెన్స్ నిఘా

నిత్యావసరాలతో పాటు కూరగాయల ధరలు పెరగకుండా రైతు బజార్లు కీలక పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, హోల్‌సేల్ డీలర్లు, మిల్లర్ల వద్ద ఉన్న నిల్వలపై యంత్రాంగానికి పూర్తి స్పష్టత ఉండాలని స్పష్టం చేశారు. ధరల నియంత్రణపై జిల్లాల వారీగా కలెక్టర్లతో సమావేశాలు నిర్వహించాలని, విజిలెన్స్ నిఘాను మరింత పెంచాలని సమీక్షలో వర్చువల్‌గా పాల్గొన్న డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, పౌర సరఫరాలు, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐపీవోకు ఏపీఎండీసీ.. సీఎం ఆమోదం

- **త్వరలో ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్**
- **రాష్ట్రంలో 209 క్లస్టర్లుగా ఖనిజ నిక్షేపాల గుర్తింపు**
- **ఒడిశా, జార్ఖండ్ బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ**
- **గనుల శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు**

అమరావతి, నవంబర్ 20 (సమయం న్యూస్): ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీని అత్యుత్తమ స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సహాయం తీసుకోవాలని సూచించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలపై చర్చించారు. మన ఖనిజ వనరులను మన రాష్ట్రంలోనే వినియోగంలోకి తెస్తూ వాటి విలువ పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఖనిజాలను కేవలం ఆదాయ వనరులుగానే కాకుండా భవిష్యత్ ఆస్తిగా మార్చడమే లక్ష్యం కావాలని స్పష్టం చేశారు.

209 క్లస్టర్లుగా ఖనిజ నిక్షేపాలు

రాష్ట్రంలో 74,860 చదరపు కిలోమీటర్ల పరిధిలో మొత్తం 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించి, 209 క్లస్టర్లుగా విభజించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. వచ్చే ఏడాది డిసెంబర్ లక్ష్యంగా ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేసేలా ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీవోకు వెళ్లే ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. అలాగే రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, వాటి విలువ పెంపు లక్ష్యంగా ప్రత్యేకంగా 'ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు. వచ్చే ఐదేళ్లలో ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియను వేగవంతం చేసేలా ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పరిష్కారానికి గడువు పొడిగింపు ప్రతిపాదనలపై సమీక్షలో చర్చించారు. వీటి పరిష్కారంతో ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉంది. మరోవైపు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా కోసం ఒడిశా, జార్ఖండ్‌లలో 1,774.6 మిలియన్ టన్నుల నిల్వలున్న మూడు బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ పాల్గొంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మెప్మా అవార్డులపై మంత్రి నారాయణ హర్షం

వీధి వ్యాపారుల సంక్షేమానికి ఈ గుర్తింపు నిదర్శనం

ఇప్పటివరకు 4.94 లక్షల మందికి రూ.1,016.88 కోట్ల రుణాలు

జాతీయ స్థాయిలో సత్తా చాటిన అధికారులకు అభినందనలు

అమరావతి, నవంబర్ 20 (సమయం న్యూస్): పీఎం స్వనిధి పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) జాతీయ స్థాయిలో పలు అవార్డులు సాధించడం పట్ల పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ హర్షం వ్యక్తం చేశారు. వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు పట్టణ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈ అవార్డులు నిదర్శనమని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, మెప్మా ఆధ్వర్యంలో తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తూ వీధి వ్యాపారుల అభివృద్ధికి అండగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు.



పీఎం స్వనిధి పథకం కింద రాష్ట్రంలో ఇప్పటివరకు 4.94 లక్షల మంది వీధి వ్యాపారులకు రూ.1,016.88 కోట్ల రుణాలు మంజూరు చేయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. 2025ఉ 26 ఆర్థిక సంవత్సరంలోనే 1.34 లక్షల మందికి రూ.284.66 కోట్ల రుణాలు పంపిణీ చేశామని, వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూత అందించడంలో ప్రభుత్వ చొరవకు ఈ గణాంకాలే నిదర్శనమని సంతోషం వ్యక్తం చేశారు. ప్రత్యేక రుణ మేళాల నిర్వహణలో దేశంలోనే ప్రథమ స్థానం, అత్యధిక రుణాల మంజూరులో రెండో స్థానం, పథకం మొత్తం అమలులో మూడో స్థానం దక్కించుకుని ఏపీ మెప్మా జాతీయ స్థాయిలో మూడు అవార్డులు సాధించడం గర్వకారణమన్నారు.

అలాగే వీధి వ్యాపారుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించే 'స్వనిధి సే సమృద్ధి' కార్యక్రమంలో రామచంద్రాపురం మున్సిపాలిటీ మొదటి స్థానం, అమలాపురం మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలవడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. డిజిటల్ లావాదేవీల నిర్వహణలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో రెండో స్థానం సాధించడం విశేషమని పేర్కొంటూ, ఈ విజయాలకు కృషి చేసిన మెప్మా, మున్సిపల్ అధికారులను మంత్రి నారాయణ అభినందించారు.

పీఎం స్వనిధిలో ఏపీకి ఏడు అవార్డులు

రాష్ట్రస్థాయిలో మూడు.. పట్టణ సంస్థలకు నాలుగు

ప్రత్యేక ప్రచార కార్యక్రమాల నిర్వహణలో తొలి స్థానం

రుణాల పంపిణీ, డిజిటల్ లావాదేవీల్లో జాతీయ గుర్తింపు

మెప్మా బృందానికి మంత్రి నారాయణ అభినందనలు

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్) : ప్రధానమంత్రి స్వనిధి పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ జాతీయస్థాయిలో సత్తా చాటింది. ఈ పథకం కింద రాష్ట్రానికి మొత్తం ఏడు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు లభించాయి. వీటిలో రాష్ట్రస్థాయిలో మూడు, పట్టణ స్థానిక సంస్థల విభాగంలో నాలుగు అవార్డులు ఉన్నాయి. న్యూఢిల్లీలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రం తరఫున మెప్మా మిషన్ డైరెక్టర్ జి. బాలకృష్ణ, అదనపు మిషన్ డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు, ఎస్ఎంఎంఈబీఎల్ ప్రభావతి వీటిని స్వీకరించారు. అవార్డులు సాధించిన జిల్లాలు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాల నిర్వహణలో ఏపీ జాతీయస్థాయిలో మొదటి స్థానం దక్కించుకుంది. రుణాల పంపిణీలో రెండో స్థానం, పథకం మొత్తం పనితీరులో మూడో స్థానం సాధించింది. పట్టణ స్థానిక సంస్థల విభాగంలో రుణాల పంపిణీలో కడప మున్సిపల్ కార్పొరేషన్ జాతీయస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. 'స్వనిధి సే సమృద్ధి' విభాగంలో రామచంద్రపురం మొదటి స్థానం, అమలాపురం రెండో స్థానం కైవసం చేసుకున్నాయి. డిజిటల్ లావాదేవీల విభాగంలో విజయనగరం పట్టణ స్థానిక సంస్థ జాతీయస్థాయిలో రెండో స్థానం సాధించింది.


మెప్మా బృందానికి అభినందనలు

ఈ జాతీయస్థాయి విజయంపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. సురేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిన మెప్మా మిషన్ డైరెక్టర్, అదనపు మిషన్ డైరెక్టర్, సిబ్బంది, అవార్డులు సాధించిన పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులను వారు అభినందించారు. వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించడం, రుణ సదుపాయాలు అందించడం, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం, స్థిరమైన జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది, జిల్లా ప్రతినిధులు, భాగస్వాముల సమష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.



తీరం దాటిన 'అక్వాన్' తుపాను

- గోపాల్‌పూర్ వద్ద 70ఉ90 కి.మీ. వేగంతో గాలులు
- ఉత్తరాంధ్రలో తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన
- శ్రీకాకుళం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- అత్యవసర సాయానికి 'మనమిత్ర' వాట్సాప్ నంబర్



అమరావతి, నవంబర్ 20 (సమయం న్యూస్): అక్వాన్ తుపాను దక్షిణ ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో శుక్రవారం ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య తీరం దాటినట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్లు తెలిపింది. తుపాను పూర్తిగా తీరం దాటే ప్రక్రియకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఉదయం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. తీరం దాటినప్పటికీ శ్రీకాకుళం జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ సూచించారు.

ఉదయం 11 గంటల తాజా సమాచారం ప్రకారం అక్వాన్ తుపాను దక్షిణ ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో కొనసాగుతోంది. ఒడిశా మీదుగా పయనిస్తూ రాబోయే మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని, ఆ తర్వాతి ఆరు గంటల్లో వాయుగుండం మరింత బలహీనపడే సూచనలు ఉన్నాయని అధికారులు అంచనా వేశారు. తుపాను ప్రభావంతో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజలు 'మనమిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009ను సంప్రదించాలని ప్రఖర్ జైన్ సూచించారు. ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అధికారుల సూచనలు పాటించాలని విపత్తుల నిర్వహణ సంస్థ విజ్ఞప్తి చేసింది.

స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- అధికారులకు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆదేశం
- వేంపల్లిలో నామినేషన్లకు పటిష్ట పోలీసు భద్రత
- ఆక్వా తుపాను ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు
- కడప, పల్నాడు కలెక్టర్లు, ఎస్పీలతో ఫోన్‌లో సమీక్ష



విజయవాడ, నవంబర్ 20 (సమయం న్యూస్) : రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఏ. మల్లికార్జున, శాంతిభద్రతల ఏడీజీ మధుసూదన్ రెడ్డి, ఐజీ బి. రాజకుమారి, వైఎస్సార్ కడప, పల్నాడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన ఫోన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికలను ప్రభావితం చేసే శక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పించాలని ఆదేశించారు.

వేంపల్లి పంచాయతీపై ప్రత్యేక దృష్టి

వేంపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు సమగ్ర పోలీసు భద్రత కల్పించాలని కమిషనర్ ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయ ప్రాంగణంలోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించడంతో పాటు సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు సూచించారు.

ఆక్వా తుపానుపై ముందస్తు జాగ్రత్తలు

ఆక్వా తుపాను ప్రభావం, తాజా వాతావరణ పరిస్థితులపై అధికారులను అడిగి పునేఠా వివరాలు తెలుసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో వర్షాలు, ప్రతికూల వాతావరణం ఏర్పడినా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలగకుండా విపత్తు నిర్వహణ, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది, ఓటర్లు, ఎన్నికల సామగ్రి రవాణా, పోలింగ్ కేంద్రాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

రామాయపట్నం పోర్టు మా దార్శనికతే

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

కస్టమ్స్ పోర్టుగా సీబీఐసీ నోటిఫికేషన్‌పై హర్షం

తీరం వెంబడి ప్రతి 50 కి.మీ.కు ఓ మౌలిక సదుపాయం ప్రణాళిక

బీపీసీఎల్, ఇండోసోల్ వంటి పరిశ్రమలతో లక్షల కోట్ల పెట్టుబడులు

దావోస్ నుంచి సీఐఐ వరకు మా పోర్టులనే చూపిస్తున్నారని ఎద్దేవా



అమరావతి, నవంబర్ 20 (సమయం న్యూస్) : రాష్ట్రంలోని రామాయపట్నం పోర్టును ఎగుమతులు, దిగుమతుల కార్యకలాపాలకు వీలుగా కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) అధికారికంగా 'కస్టమ్స్ పోర్టు'గా నోటిఫై చేయడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో రూపొందించిన మౌలిక సదుపాయాల దార్శనికతే నేడు ఆంధ్రప్రదేశ్‌కు అతిపెద్ద పెట్టుబడి ప్రతిపాదనగా మారిందని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. సీబీఐసీ అధికారిక ప్రకటన తమ హయాంలో ప్రారంభించిన సముద్ర మౌలిక సదుపాయాల కలను సాకారం చేసే దిశగా మరో కీలక ముందడుగు అని తెలిపారు. ఏపీకి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టు ఆధారిత పారిశ్రామికీకరణ సాధించాలన్న లక్ష్యంతో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టులతో పాటు 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తీరం వెంబడి దాదాపు ప్రతి 50 కిలోమీటర్లకు ఒక మౌలిక సదుపాయం ఉండేలా ప్రణాళికలు రచించామన్నారు.

రామాయపట్నం పోర్టును ప్రధాన గ్రోత్ ఇంజన్‌గా తీర్చిదిద్దాలన్న తమ ఆలోచన నేడు వాస్తవ రూపం దాల్చుతోందని జగన్ వివరించారు. పోర్టు చుట్టుపక్కల బీపీసీఎల్ మెగా రిఫైనరీఉపెట్రోకెమికల్ కాంప్లెక్స్, ఇండోసోల్ సోలార్ ఇంటిగ్రేటెడ్ తయారీ కేంద్రంతో పాటు మరిన్ని భారీ పరిశ్రమలు రూపుదిద్దుకుంటున్నాయని, దీనివల్ల లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలతో పూర్తిస్థాయి పారిశ్రామిక వ్యవస్థ ఏర్పడుతోందని తెలిపారు. ప్రస్తుత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దావోస్ సదస్సు నుంచి సీఐఐ సమ్మిట్‌ల వరకు ఎక్కడికి వెళ్లినా, పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు తాము ప్రారంభించిన ఈ పోర్టులనే ప్రధానంగా చూపిస్తోందని, తమ దార్శనికతకు ఇదే అసలైన నిదర్శనమని జగన్ ఎద్దేవా చేశారు.

జడ్పీ పీఠాలపై కూటమి హవా

28 జిల్లాల్లో 27 చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలు కైవసం

టీడీపీకి 22 చైర్మన్, 20 వైస్ చైర్మన్ పదవులు

ఒక్క అల్లూరి జిల్లాకే పరిమితమైన వైసీపీ

అమరావతి, నవంబర్ 20 (సమయం న్యూస్) : రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 28 జిల్లా పరిషత్‌లకు జరిగిన ఈ ఎన్నికల్లో అధికార కూటమి పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి, 27 జిల్లాల్లో విజయధ్వంకా మోగించింది. 28 జడ్పీ చైర్మన్ పదవుల్లో టీడీపీ అత్యధికంగా 22 స్థానాల్లో గెలుపొందగా, మిత్రపక్షాలైన జనసేన 4, బీజేపీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్క జడ్పీ చైర్మన్ స్థానానికి మాత్రమే పరిమితమైంది. వైస్ చైర్మన్ పదవుల ఎన్నికల్లోనూ ఇదే తరహా ఫలితాలు నమోదయ్యాయి. 28 స్థానాల్లో టీడీపీ 20, జనసేన 5, బీజేపీ 2 పదవులను కైవసం చేసుకున్నాయి. వైసీపీకి ఒక్క వైస్ చైర్మన్ పదవి మాత్రమే దక్కింది. ఈ ఫలితాలతో రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థల పరిపాలనలో కూటమి పార్టీల పట్టు మరింత బలపడింది. ఈ ఎన్నికలతో రాష్ట్రంలోని అన్ని జిల్లా పరిషత్‌ల నూతన పాలకవర్గాల ఎంపిక పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీల హవా కొనసాగినప్పటికీ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రం భిన్నమైన ఫలితం కనిపించింది. ఈ జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ రెండు పదవులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మిగిలిన 27 జిల్లాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించగా, ఒక్క అల్లూరి జిల్లాలో మాత్రమే వైసీపీ ఈ రెండు కీలక పదవులను నిలబెట్టుకోవడం గమనార్హం.



జనసేన కోటాలో 8 మంది మహిళలకు అవకాశం

జడ్పీ పదవుల పంపకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన నేతల మధ్య రెండు రోజుల పాటు పలుమార్లు చర్చలు జరిగిన అనంతరం జనసేన అధిష్ఠానం తమ అభ్యర్థులను ఖరారు చేసింది. పార్టీకి దక్కిన మొత్తం తొమ్మిది స్థానాల్లో (4 చైర్‌పర్సన్, 5 వైస్ చైర్‌పర్సన్) ఏకంగా 8 పదవులకు మహిళా అభ్యర్థులనే ఎంపిక చేయడం విశేషం. కేవలం ఒకే ఒక స్థానానికి పురుష అభ్యర్థికి అవకాశం ఇచ్చింది. శ్రీకాకుళం జడ్పీ చైర్‌పర్సన్‌గా కొరికాన భవాని, పార్వతీపురం చైర్‌పర్సన్‌గా నిమ్మల నీలిమ, అనకాపల్లి చైర్‌పర్సన్‌గా మోటూరు నాగమణి, కాకినాడ చైర్‌పర్సన్‌గా బుర్రా దివ్య సునీతరాజ్ ఎంపికయ్యారు. అలాగే తూర్పుగోదావరి జడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా పల్నాటి రజని, కోనసీమ వైస్ చైర్మన్‌గా ఎలిశెట్టి రామకృష్ణ, బాపట్ల వైస్ చైర్‌పర్సన్‌గా కలవకూరి పిచ్చమ్మ, ప్రకాశం వైస్ చైర్‌పర్సన్‌గా వరికూటి లక్ష్మీ తాయారు, సత్యసాయి జడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా దాసరి సునేత్రలను పార్టీ ప్రకటించడంతో అభ్యర్థులు, శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

అదే రోజు స్పందనే మా 'టాప్ సీక్రెట్'!

తమిళనాడు 'గైడెన్స్' సమాచార లీక్ ప్రచారంపై లోకేశ్ స్పందన

మా పెట్టుబడి వ్యూహాన్ని ఎవరైనా కాపీ చేసుకోవచ్చని ట్వీట్

పొరుగు రాష్ట్రాల సమాచారం మాకు అవసరం లేదని స్పష్టత

వేగవంతమైన పాలనతోనే ఇన్వెస్టర్ల నమ్మకం గెలుస్తున్నామని వెల్లడి

అమరావతి, నవంబర్ 20 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య పెట్టుబడుల ఆకర్షణపై పోటీ సాగుతున్న నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ 'గైడెన్స్'కు చెందిన కీలక సమాచారం ఏపీకి లీక్ అయిందన్న ప్రచారం, అక్కడ 15 మంది అధికారుల తొలగింపుపై చర్చ జరుగుతున్న క్రమంలో ఆయన స్పందించారు. పెట్టుబడుల విషయంలో ఏపీ అనుసరిస్తున్న అసలు వ్యూహాన్ని తానే స్వయంగా బయటపెడుతున్నట్లు ట్వీట్ చేశారు. తమ ప్రభుత్వ 'టాప్ సీక్రెట్' పెట్టుబడి వ్యూహం రహస్యం మరేదో కాదని, పెట్టుబడిదారులకు అదే రోజు సమాధానం ఇవ్వడమేనని లోకేశ్ స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపన కోసం ముందుకొచ్చే ఇన్వెస్టర్ల సందేహాలకు, ప్రతిపాదనలకు ఏమాత్రం జాప్యం చేయకుండా తక్షణమే స్పందించడమే తమ విజయానికి కారణమని పేర్కొన్నారు.



ఈ వ్యూహాన్ని ఎవరైనా సరే నిరభ్యంతరంగా కాపీ చేసుకోవచ్చని పిలుపునిచ్చారు. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ప్రభుత్వ నిర్ణయాలు, వాణిజ్య విధానాలే రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నాయని, పొరుగు రాష్ట్రాల నుంచి సమాచారాన్ని సేకరించాల్సిన అవసరం తమకు లేదని తేల్చిచెప్పారు. పారదర్శకత, వేగవంతమైన పాలనతోనే పారిశ్రామికవేత్తల నమ్మకాన్ని గెలుచుకుంటున్నామన్న లోకేశ్ ట్వీట్ ప్రస్తుతం రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఏపీలో 12వ పీఆర్సీ ఏర్పాటు

కమిషనర్‌గా విశ్రాంత ఐఏఎస్ దినేష్ కుమార్ నియామకం

కార్యదర్శిగా డాక్టర్ పి. లక్ష్మీనర్సింహం.. ఏడాదిలోగా నివేదిక

వేతనాలు, డీఏ విలీనం, పెన్షన్లపై సమగ్ర పరిశీలన

గెజిటెడ్ హోదా ప్రమాణాలపైనా కమిషన్ సూచనలు

అమరావతి, నవంబర్ 20 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 12వ వేతన సవరణ సంఘాన్ని (పీఆర్సీ) ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంఘానికి కమిషనర్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్‌ను, కార్యదర్శిగా డాక్టర్ పి. లక్ష్మీనర్సింహంను నియమించింది. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఏడాది లోగా నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీనికి సంబంధించి గతంలో జారీ చేసిన జీవోలో పేర్కొన్న విధివిధానాలే వర్తిస్తాయని స్పష్టం చేసింది. కమిషనర్ నియామకంతో పీఆర్సీ కార్యకలాపాలు వేగవంతం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ సంస్థల్లోని వివిధ కేటగిరీల ఉద్యోగుల వేతనాలు, ఇతర ప్రయోజనాలు, సర్వీసు నిబంధనలకు సంబంధించిన సూత్రాలను ఈ కమిషన్ రూపొందించనుంది. విశ్వవిద్యాలయాల్లోని బోధనేతర సిబ్బంది, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) ఉద్యోగులు, వర్క్‌చార్జ్డ్ ఉద్యోగులకు అందుతున్న ఆర్థిక ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మార్పులపై సిఫార్సులు చేయనుంది. ప్రస్తుతం అమలులో ఉన్న డీఏను జీతంలో ఎంతవరకు విలీనం చేయవచ్చో పరిశీలించి కొత్త పేస్కేళ్లను రూపొందించడంతో పాటు, పెన్షనర్లకు అమలవుతున్న పెన్షన్ విధానాన్ని సమీక్షించి తగిన సూచనలు చేయనుంది. అలాగే ఉద్యోగ సంఘాలు, పరిపాలనా విభాగాలు ప్రతిపాదించిన వివిధ పోస్టులకు గెజిటెడ్ హోదా కల్పించేందుకు అవసరమైన ప్రమాణాలు, అర్హతలు, మార్గదర్శకాలపైనా కమిషన్ సిఫార్సులు అందించనుంది.

నా నిర్ణయం మారదు: ఆదినారాయణ రెడ్డి

కడప జడ్పీ చైర్మన్ పదవిపై హామీ తప్పారని ఆగ్రహం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో భేటీ అనంతరమూ వీడని అలక

రాజీనామాపై ప్రకటన చేస్తానని వెల్లడి

జడ్పీటీసీ రాకేష్ రెడ్డి కూడా రాజీనామా చేస్తారని వ్యాఖ్య



అమరావతి, నవంబర్ 20 (సమయం న్యూస్) : కడప జడ్పీ చైర్మన్ పదవి తన సన్నిహితుడు రాకేష్ రెడ్డికి దక్కకపోవడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తన నిర్ణయాన్ని మార్చుకునేది లేదని స్పష్టం చేశారు. ఆయన పార్టీకి రాజీనామా చేస్తారన్న ప్రచారం నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అమరావతిలోని హోటల్ మినర్వాలో ఆదినారాయణ రెడ్డితో గంటపాటు భేటీ అయ్యారు. అయితే ఈ చర్చల అనంతరం కూడా ఆయన అలక వీడలేదు.

భేటీ అనంతరం ఆదినారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తన రాజీనామాపై రేపు ప్రకటన చేస్తానని తెలిపారు. జడ్పీ చైర్మన్ పదవిపై ముందుగా హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు లాబీయింగ్ చేస్తే తనకు ఇచ్చిన మాట తప్పారో తెలియాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పదవి తనకేం గొప్ప కాదని, తాను తలుచుకుంటే నిమిషాల్లో సమీకరణాలు మారుతాయని వ్యాఖ్యానించారు. కుట్రలకు స్పష్టత ఉండదని, రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చని పేర్కొంటూ.. క్రికెట్‌లో సూపర్ ఓవర్ మాదిరిగా రాజకీయాలు జరిగాయన్నారు. పార్టీ తనకు పూర్తి మద్దతుగా ఉందని, సాయంత్రం అధిష్ఠానంతో చర్చలు ఉన్నాయని ఆయన వివరించారు. జడ్పీటీసీ రాకేష్ రెడ్డి కూడా తన పదవికి రాజీనామా చేస్తారని ఆదినారాయణ రెడ్డి చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయన రేపు ఎలాంటి ప్రకటన చేస్తారన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

అందుబాటులోకి స్వదేశీ బర్డ్ ఫ్లూ వ్యాక్సిన్

భోపాల్‌లో ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్!



భోపాల్, నవంబర్ 20 (సమయం న్యూస్): దేశంలోని కోళ్ల పరిశ్రమకు ముప్పుగా మారిన బర్డ్ ఫ్లూ వ్యాధి నియంత్రణలో భారత శాస్త్రవేత్తలు కీలక పురోగతి సాధించారు. అత్యంత ప్రమాదకరమైన హెచ్5ఎన్1 వైరస్‌ను ఎదుర్కొనేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి టీకాను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భోపాల్‌లో ఆవిష్కరించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి పరిధిలోని జాతీయ అత్యున్నత భద్రతా పశువ్యాధుల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ఈ టీకాను రూపొందించారు. హెచ్5ఎన్1 వైరస్‌లోని క్లేడ్ 2.3.2.1ఏ రకాన్ని ఎదుర్కొనేందుకు దీనిని అభివృద్ధి చేసినట్లు అధికారులు వెల్లడించారు. పక్షుల్లో వేగంగా వ్యాపించే బర్డ్ ఫ్లూ కారణంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కోళ్ల పరిశ్రమ తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంది. వ్యాధి వ్యాప్తి చెందిన ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లను నిర్మూలించాల్సి రావడంతో పెంపకందారుల జీవనోపాధిపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా స్వదేశీ పరిజ్ఞానంతో టీకాను అభివృద్ధి చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వ్యాధి నివారణ చర్యల్లో ఈ టీకా కీలకంగా ఉపయోగపడుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ కోళ్ల పరిశ్రమ పరిరక్షణతోపాటు పెంపకందారుల జీవనోపాధిని బలోపేతం చేయడంలో స్వదేశీ టీకా అభివృద్ధి ముఖ్యమైన ముందడుగని పేర్కొన్నారు. పరిశోధనల్లో విజయం సాధించిన శాస్త్రవేత్తలు, పరిశోధకులను అభినందించారు. దేశీయ పశువైద్య పరిశోధన సామర్థ్యానికి ఈ ఆవిష్కరణ నిదర్శనమని తెలిపారు. టీకా వినియోగం విస్తరించినప్పుడు బర్డ్ ఫ్లూ వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రఫేల్ ఫైటర్ జెట్ల అదృశ్యం అంటూ 'ఫ్లైట్ గ్లోబల్' డొల్ల కథనం..

తిప్పికొట్టిన మాజీ ఎయిర్ మార్షల్ తివారీ!

న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళానికి చెందిన నాలుగు రఫేల్ యుద్ధవిమానాలు అదృశ్యమయ్యాయంటూ బ్రిటన్‌కు చెందిన విమానయాన పత్రిక 'ఫ్లైట్ గ్లోబల్' ప్రచురించిన కథనం వివాదానికి దారితీసింది. ఈ కథనాన్ని భారత వైమానిక దళ మాజీ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ తీవ్రంగా ఖండించారు. ప్రచురించిన గణాంకాలను, ఆధారాలను మరోసారి పరిశీలించుకోవాలని సామాజిక మాధ్యమం ద్వారా సూచించారు. భారత్ ఫ్రాన్స్ నుంచి మొత్తం 36 రఫేల్ యుద్ధవిమానాలను కొనుగోలు చేయగా, ఫ్లైట్ గ్లోబల్ తాజా ప్రపంచ వైమానిక దళాల వివరాల్లో భారత్ వద్ద 32 విమానాలే ఉన్నట్లు పేర్కొంది. అయితే ఈ సంఖ్యలో వ్యత్యాసం నాలుగు విమానాలు కూలిపోయాయనడానికి స్వతంత్ర ఆధారం కాదని గుర్తించాల్సి ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత రఫేల్ యుద్ధవిమానాలను కూల్చివేశామంటూ పాకిస్థాన్ చేసిన ప్రకటనలను తివారీ ప్రస్తావించారు. అప్పట్లో కొన్ని విమానాల గుర్తింపు సంఖ్యలను కూడా వెల్లడించారని, అయితే ఆ సంఖ్యలతో ఉన్న విమానాలు అనంతరం వివిధ అంతర్జాతీయ విన్యాసాల్లో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత వైమానిక దళ మహిళా రఫేల్ పైలట్ శివాంగి సింగ్‌ను పాకిస్థాన్ బందీగా పట్టుకుందంటూ గతంలో వచ్చిన వార్తలను కూడా గుర్తుచేశారు. ఆ ప్రచారాన్ని భారత వైమానిక దళం అప్పట్లోనే ఖండించిందన్నారు. అనంతరం అంబాలా వైమానిక స్థావరంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి శివాంగి సింగ్ కనిపించిన విషయాన్ని ప్రస్తావించారు. మరోవైపు ఫ్లైట్ గ్లోబల్ కథనానికి సమాచారం అందించినట్లు పేర్కొంటున్న బ్రిటన్ విమానయాన రచయిత అలన్ వార్న్‌పై సామాజిక మాధ్యమాల్లో పలు ఆరోపణలు వెలువడ్డాయి. పాకిస్థాన్‌కు అనుకూలంగా కథనాలు రాసినందుకు ఆయనకు నగదు చెల్లించారంటూ కొన్ని ఖాతాలు ప్రచారం చేస్తున్నప్పటికీ, ఆ ఆరోపణలకు స్వతంత్ర ధ్రువీకరణ లేదు. ఇదిలా ఉండగా, ఫ్లైట్ గ్లోబల్ ప్రచురించిన గణాంకాలను పాకిస్థాన్ మీడియా తమ దేశం గతంలో చేసిన ప్రకటనలకు మద్దతుగా ప్రస్తావిస్తోంది. అయితే విమానాల సంఖ్యలో తేడా, యుద్ధంలో జరిగిన నష్టాలు, వాటికి సంబంధించిన అధికారిక నిర్ధారణ వేర్వేరు అంశాలు కావడంతో ఈ వివాదంపై స్పష్టమైన ఆధారాలకు ప్రాధాన్యం ఏర్పడింది.

వాహనాలపై కులం పేరు కనిపిస్తే చర్యలే!

కుల గుర్తులు, పేర్లు, చిహ్నాల ప్రదర్శనపై గుజరాత్ ప్రభుత్వం నిషేధం

గాంధీనగర్, నవంబర్ 21 (సమయం న్యూస్): ప్రైవేటు వాహనాలపై కులాన్ని సూచించే పేర్లు, గుర్తులు, చిహ్నాలు, అంకెల ప్రదర్శనపై గుజరాత్ ప్రభుత్వం నిషేధం విధించింది. ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలతోపాటు బస్సులు, లారీలకు కూడా ఈ నిబంధనలు వర్తించనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఓడరేవులు, రవాణా శాఖ నవంబర్ 17న గుజరాత్ మోటారు వాహనాల మూడో సవరణ నిబంధనలు--2026ను అధికారికంగా ప్రకటించింది. వాహనాలపై కుల గుర్తింపును ప్రదర్శించడాన్ని నియంత్రించేందుకు మోటారు వాహనాల నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. 1989 నాటి గుజరాత్ మోటారు వాహనాల నిబంధనల్లోని 125(1)వ నిబంధనను ప్రభుత్వం సవరించింది. గతంలో ఉన్న 'ప్రకటన పరికరాలు, బొమ్మలు' అనే పదాలకు అదనంగా 'కుల సూచికలు' అనే పదాన్ని చేర్చింది. అలాగే 138(2)వ నిబంధన తర్వాత కొత్తగా మూడో ఉపనిబంధనను ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ప్రభుత్వం సాధారణ లేదా ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా అనుమతించిన సందర్భాలు మినహా ప్రైవేటు వాహనాలపై ప్రకటనలు, కులాన్ని సూచించే పేర్లు, చిహ్నాలు, బొమ్మలు, ఇతర రాతలను ప్రదర్శించరాదు. దీంతో వాహనాలపై కుల గుర్తింపును చాటే పదాలు, సంకేతాల ప్రదర్శన కూడా మోటారు వాహనాల నిబంధనల పరిధిలోకి వచ్చింది. ఈ సవరణలకు సంబంధించి ప్రభుత్వం తొలుత జూన్ 11న ముసాయిదా నిబంధనలను ప్రత్యేక గెజిట్‌లో ప్రచురించింది. ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు 30 రోజుల గడువు ఇచ్చింది. నిర్దేశిత సమయంలో ఎలాంటి అభ్యంతరాలు అందకపోవడంతో నవంబర్ 17న తుది నిబంధనలను ప్రకటించి అమల్లోకి తీసుకొచ్చింది. కొత్త నిబంధనలతో ప్రైవేటు వాహనాలపై కుల గుర్తింపును ప్రదర్శించే విధానానికి అడ్డుకట్ట వేయాలని గుజరాత్ ప్రభుత్వం నిర్ణయించింది.







సంస్కృతుల కలయికే.. ప్రపంచ శాంతికి రక్ష

- **దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడులతో సంబంధాలు బలోపేతం**
- **షాంఘై సహకార సంస్థ నాగరికతల సంభాషణ వేదికలో ప్రధాని మోదీ**
- **ప్రాచీన గ్రంథాలు, చారిత్రక పత్రాలను అంకెల రూపంలో భద్రపరచాలని సూచన**
- **బౌద్ధ క్షేత్రాలు, ప్రాచీన వాణిజ్య మార్గాలతో పర్యాటకాభివృద్ధికి పిలుపు**

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్): ప్రపంచ దేశాల మధ్య శాంతికి సాంస్కృతిక అనుసంధానమే బలమైన గ్యారంటీ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని చారిత్రక పురానా ఖిలాలో తొలి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) నాగరికతల సంభాషణ వేదికను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. వివిధ దేశాల మధ్య జరిగే సాంస్కృతిక మార్పిడులు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ప్రపంచాన్ని ఏకం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీఓ సభ్య దేశాల మధ్య సాంస్కృతిక సహకారాన్ని మరింత విస్తరించేందుకు మోదీ పలు కీలక ప్రతిపాదనలు చేశారు. ఎస్‌సీఓ దేశాల సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడంలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని ప్రధాని మోదీ సూచించారు. అనేక గొప్ప సాహిత్య రచనలు పరిమిత భాషల్లోనే అందుబాటులో ఉన్నాయని, వాటిని ఇతర భాషల్లోకి అనువదించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత కాలంలో గతంలో ఎన్నడూ లేనన్ని సాంకేతిక వనరులు అందుబాటులో ఉన్నాయని, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, సభ్య దేశాల్లోని మ్యూజియంలు, గ్రంథాలయాలు, ఆర్కైవ్‌లలో వేల ఏళ్ల చరిత్రకు సంబంధించిన విలువైన సంపద ఉందని గుర్తుచేశారు. ప్రాచీన మ్యానుస్క్రిప్ట్‌లు, అరుదైన గ్రంథాలు, చారిత్రక పత్రాలు, కళాఖండాలు ఆయా నాగరికతల మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తాయని, వాటిని డిజిటలైజ్ చేయడంతో పాటు పరస్పరం అనువదించుకునేందుకు సభ్య దేశాలు కలిసి పనిచేయాలని సూచించారు. సాంస్కృతిక పర్యాటక రంగంలోనూ ఎస్‌సీఓ దేశాల మధ్య సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సభ్య దేశాల్లో సిల్క్ రూట్స్, ఉమ్మడి బౌద్ధ వారసత్వానికి సంబంధించిన అనేక చారిత్రక ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. వాటన్నింటినీ అనుసంధానిస్తూ ప్రత్యేక హెరిటేజ్ సర్క్యూట్లు, సాంస్కృతిక పర్యాటక మార్గాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. తద్వారా ఆయా దేశాల మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ప్రజలు మరింత లోతుగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

తిరుపరంకుండ్రంలో దీపారాధనకు సుప్రీంకోర్టు అనుమతి!

నవంబర్ 24న ఒక్కసారి మాత్రమే దీపం వెలిగించేందుకు అవకాశం

భక్తుల ప్రవేశానికి అనుమతి లేదు.. పరిమిత బృందానికే చాన్స్

దర్గా, మసీదు ప్రార్థనలకు ఆటంకం కలగకూడదని స్పష్టీకరణ



న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్): తమిళనాడులోని తిరుపరంకుండ్రం కొండపై ఉన్న దర్గా సమీపంలోని దీపస్తంభం వద్ద కార్తీక దీపం వెలిగించే వివాదంపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ 24న ఒక్కసారి మాత్రమే కొన్ని షరతులతో దీపం వెలిగించేందుకు అనుమతించింది. సాధారణ భక్తులకు కూడా ప్రవేశం కల్పిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన విస్తృత ఆదేశాల అమలుపై నిలుపుదల విధించింది. ఆలయ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కూడిన పరిమిత బృందం మాత్రమే దీపారాధనలో పాల్గొనాలని స్పష్టం చేసింది. దీపారాధనలో పాల్గొనే బృందం సంఖ్యను ఆలయ కార్యనిర్వహణాధికారి, భారత పురావస్తు శాఖ అధికారులు, పోలీసు కమిషనర్‌తో సంప్రదించి మదురై జిల్లా కలెక్టర్ నిర్ణయించాలని న్యాయస్థానం ఆదేశించింది. వేడుక ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించాలని, పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని సూచించింది. అవసరమైతే కేంద్ర రిజర్వు పోలీసు బలగాలను కూడా వినియోగించుకోవచ్చని పేర్కొంది. కార్యక్రమం ముగిసిన మూడు రోజుల్లోగా ఉత్తర్వుల అమలుపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. కొండపై ఉన్న దర్గా, మసీదుల్లో సంప్రదాయ ప్రార్థనలకు ఎలాంటి ఆటంకం కలగకూడదని సుప్రీంకోర్టు ప్రత్యేకంగా స్పష్టం చేసింది. ప్రార్థనా స్థలాలకు వెళ్లే మార్గాలను అడ్డుకోరాదని సూచించింది. ఒక్కరోజు దీపారాధనకు ఇచ్చిన అనుమతిని అదనపు ప్రవేశ హక్కుగా గానీ, కొండపై యాజమాన్య లేదా నియంత్రణ హక్కుగా గానీ పరిగణించరాదని తేల్చిచెప్పింది. మతపరమైన సంప్రదాయాలు, యాజమాన్య హక్కులకు సంబంధించిన ప్రధాన వివాదాలను తదుపరి విచారణకు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల అనంతరం మదురైలోని ఆలయం వెలుపల హిందూ మున్నాని, బీజేపీ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. అయితే దీపారాధనకు అనుమతిస్తూనే ప్రజల ప్రవేశాన్ని నియంత్రించడం, ఇతర మతాల ప్రార్థనలకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించడం ద్వారా న్యాయస్థానం శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చింది.



భారత్‌కు పాక్ మంత్రి రాక

మోదీ సర్కారుపై విపక్షాల తీవ్ర విమర్శలు!

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్): ఢిల్లీలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమావేశం కోసం పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ భారత్‌కు రావడంతో రాజకీయ దుమారం చెలరేగింది. ఈ క్రమంలో కేంద్రం అనుసరిస్తున్న విదేశాంగ విధానాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత సమయంలో ముసాదిక్ మాలిక్ భారత్‌పై తీవ్ర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. 'మా నీళ్లను ముట్టుకుంటే చేతులు నరికేస్తాం' అంటూ ఆయన అప్పట్లో హెచ్చరికలు చేశారు. అయితే ఇప్పుడు అదే ముసాదిక్ మాలిక్ భారత్‌లో పర్యటించడం వివాదానికి దారితీసింది. బీజేపీ విదేశాంగ విధానం పూర్తిగా గందరగోళమయంగా ఉందని సమాజ్‌వాది పార్టీ నాయకుడు ఫక్రుల్ హసన్ విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సైతం ముసాదిక్ మాలిక్ రాకపై సెటైర్లు పేల్చింది. ఉగ్రవాదానికి ఎప్పుడూ వ్యతిరేకమని చెప్పే బీజేపీ, ఇప్పుడు పాకిస్థాన్ మంత్రిని స్వాగతిస్తోందని చురకలంటించింది. విదేశీ వ్యవహారాల అంశంలో కేంద్రం అయోమయ స్థితిలో ఉందని, భారతీయ క్రికెటర్లను పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఆడాలని కోరే బీజేపీ.. మరోవైపు పాక్ మంత్రులకు ఆహ్వానం పలుకుతోందని ఇండియా కూటమి నాయకుడు సురేంద్ర రాజ్‌పూత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గందరగోళంలో ఉన్న ప్రధానమంత్రి మోదీ ఒత్తిడిలో పనిచేస్తున్నట్లున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారి మాట్లాడుతూ.. పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రిపై మండిపడ్డారు. గతంలో ముసాదిక్ మాలిక్ చేసిన వ్యాఖ్యలు ఉగ్రవాదుల హెచ్చరికలకు ఏమాత్రం తీసిపోవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, నవంబర్ 20 నుంచి 22 వరకు ఢిల్లీలో ఎస్‌సీఓ నాగరికతల సంభాషణ సమావేశం జరగనుంది. ఇందులో భారత్, చైనా, రష్యా, పాకిస్థాన్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్ దేశాలు పాల్గొంటున్నాయి.

సీఈసీ, ఈసీ నియామక చట్టంపై విస్తృత విచారణ

ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి బాధ్యత

రీకాల్ పిటిషన్‌పై విడిగా విచారణకు నిరాకరణ

జస్టిస్ శర్మ పదవీ విరమణపై సీజేఐ స్పష్టత



న్యూఢిల్లీ, నవంబర్ 20: ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం-2023 రాజ్యాంగబద్ధతపై దాఖలైన పిటిషన్ల విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. గతంలో ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం వెలువరించిన భిన్నాభిప్రాయాల తీర్పును వెనక్కి తీసుకోవాలంటూ దాఖలైన రీకాల్ పిటిషన్‌ను ప్రత్యేకంగా విచారించేందుకు నిరాకరించింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనమే పరిశీలిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇందులో జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన కూడా సభ్యులుగా ఉన్నారు. రీకాల్ దరఖాస్తుతో పాటు కేసును విస్తృత ధర్మాసనానికి నివేదించడంపై ఉన్న అభ్యంతరాలనూ అదే ధర్మాసనం విచారిస్తుందని తెలిపింది. ఈ కేసులో సెప్టెంబర్ 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం భిన్నాభిప్రాయాలతో తీర్పు వెలువరించింది. ఈ తీర్పును రీకాల్ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. దీనిని గతంలో విచారణ జరిపిన ధర్మాసనం ముందే చేపట్టాలని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోరారు. అయితే జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ వచ్చే వారం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ప్రస్తుత ధర్మాసనమే విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. భూషణ్ విజ్ఞప్తిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. సంబంధిత న్యాయమూర్తి పదవీ విరమణ చేసినా ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం రీకాల్ పిటిషన్‌ను విచారించవచ్చని స్పష్టం చేశారు. ఈ అంశంపై విడిగా విచారణ జరపాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం 2023లో ఎన్నికల కమిషనర్ల నియామకానికి కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధాని నామినేట్ చేసిన కేంద్ర కేబినెట్ మంత్రి సభ్యులుగా ఉండే కమిటీ నియామకాలకు సిఫార్సులు చేస్తుంది. అంతకుముందు ఈ ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా స్థానం ఉండేది. కొత్త చట్టం ద్వారా ఆ స్థానాన్ని తొలగించడాన్ని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ చట్టం రాజ్యాంగబద్ధతపై ఐదుగురు సభ్యుల ధర్మాసనం తుది విచారణ చేపట్టనుంది. రీకాల్ పిటిషన్, రిఫరెన్స్ ఉత్తర్వులపై అభ్యంతరాలు కూడా ఇదే ధర్మాసనం పరిశీలించనుండటంతో తదుపరి విచారణపై ఆసక్తి నెలకొంది.

దిగొచ్చిన పసిడి

ఒక్కరోజే బంగారం రూ.5వేలపైగా..

వెండి రూ.10వేలు తగ్గింపు

ఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్): దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా పతనమవుతున్నాయి. హైదరాబాద్ విపణిలో శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయానికి 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పసిడి ధర ఏకంగా రూ.1.30లక్షల కిందకు పడిపోయి రూ.1,27,900కు దిగొచ్చింది. క్రితం రోజు ముగింపుతో (రూ.1.33లక్షలు) పోలిస్తే పుత్తడి ధర దాదాపు రూ.5300 మేర తగ్గడం విశేషం. ఇక, వెండి ధర కూడా భారీగానే దిగొచ్చింది. కేజీ ధర రూ.1,54,680 పలికింది. క్రితం రోజుతో (రూ.1.65లక్షలు) పోలిస్తే వెండి ధర దాదాపు రూ.10వేల పైనే తగ్గింది. ఇక, అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 3546 డాలర్లు పలుకుతోంది. గత కొంతకాలంగా 4వేల డాలర్ల పైనే ఉన్న స్పాట్ గోల్డ్ ధర.. రోజుల వ్యవధిలోనే 500 డాలర్లకు పైగా పడిపోవడం గమనార్హం. ఇక, వెండి ధర ఔన్సు 41.84 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరు డెలివరీ 10 గ్రాముల ధర రూ.1.22లక్షలు, కిలో వెండి రూ.1.49లక్షలుగా కొనసాగుతోంది. సాధారణంగా బంగారం లావాదేవీలు డాలర్ల రూపేణ జరుగుతాయి.

రాజ్యాంగ విలువలను బలోపేతం చేయాలి

హక్కులతో పాటు విధులకూ సమాన ప్రాధాన్యం

రాజ్యాంగం దేశానికి నైతిక దిక్సూచి

5వ రాజ్యాంగ వారోత్సవంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్) : బాధ్యతాయుత పౌరసత్వం ద్వారా రాజ్యాంగ విలువలను మరింత బలోపేతం చేయాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. హక్కులతో పాటు పౌరుల విధులకూ సమాన ప్రాధాన్యం ఉందన్నారు. బెన్నెట్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన ఐదో రాజ్యాంగ వారోత్సవంఉ2026ను ఆయన ప్రారంభించారు. రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం కాదని, దేశానికి నైతిక దిక్సూచి అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రాజ్యాంగ ఆకాంక్షలు ప్రజల జీవితాల్లో స్పష్టమైన ఫలితాలుగా మారుతున్నాయని రాధాకృష్ణన్ అన్నారు. సుమారు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడటం, 4 కోట్ల పక్కా ఇళ్ల నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కనెక్షన్లు 82 శాతానికి చేరడం వంటి అంశాలను ప్రస్తావించారు. మహిళల భాగస్వామ్యం పెరుగుతోందని, దేశ అభివృద్ధి 'మహిళా అభివృద్ధి' నుంచి 'మహిళా నాయకత్వంలోని అభివృద్ధి' దిశగా సాగుతోందని ఉపరాష్ట్రపతి అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు స్థిరమైన అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సాంకేతికత మానవాళికి ఉపయోగపడేలా, రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా మారి ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.



గ్రామీణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక ప్రచారం

'స్వచ్ఛ శౌచాలయ్-గరిమామయ్ భవిష్య' షురూ

డిసెంబర్ 10 వరకు దేశవ్యాప్తంగా నిర్వహణ

మహిళలు, దివ్యాంగుల అవసరాలకు ప్రాధాన్యం



న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్) : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని తాగునీరు, పారిశుద్ధ్య విభాగం 'స్వచ్ఛ శౌచాలయ్ఉగరిమామయ్ భవిష్య' (ఎస్ఎస్జీబీ) ప్రచారాన్ని ప్రారంభించింది. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్)లో భాగంగా ఈ ప్రచారం నవంబర్ 19 నుంచి డిసెంబర్ 10 వరకు దేశవ్యాప్తంగా కొనసాగనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని సామూహిక, పాఠశాలలు, అంగన్వాడీలు, పంచాయతీ కార్యాలయాల మరుగుదొడ్ల పనితీరు, అందుబాటును పరిశీలించి అవసరమైన మరమ్మతులు, నిర్వహణ చేపట్టడం ఈ ప్రచారం ప్రధాన లక్ష్యం. ఇందులో మహిళలు, బాలికలు, దివ్యాంగుల అవసరాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సింగిల్ పిట్ మరుగుదొడ్లను సాధ్యమైన చోట డబుల్ పిట్లుగా మార్చడం, సెప్టిక్ ట్యాంకులకు సోక్పిట్లు ఏర్పాటు చేయడం, యాంత్రీకృత స్లడ్జ్ తొలగింపు, వ్యర్థాల నాలుగు రకాల వేర్పాటు, చేతులు సబ్బుతో కడుక్కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. గ్రామాల్లో ఓడీఎఫ్ స్థిరత్వాన్ని కొనసాగించడం, మరుగుదొడ్లను పరిశుభ్రంగా, అందరికీ అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దడం, ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని సాధించడం ప్రచారం లక్ష్యంగా పెట్టుకుంది. స్వచ్ఛ సేవా ఆంకలన్ను నవంబర్ 30లోగా పూర్తి చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంఉ2026 థీమ్ "సేఫ్ టాయిలెట్స్.. ఈక్వల్ ఫ్యూచర్స్"కు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

డిజిటల్ ప్రాప్యతపై కేంద్రం ప్రత్యేక దృష్టి

వికలాంగులకు అందుబాటులోకి ప్రభుత్వ సేవలు

ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధితో ఐటీ శాఖ చర్చలు

అడ్డంకులు లేని డిజిటల్ భారత్ లక్ష్యంగా చర్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్) : వికలాంగుల కోసం డిజిటల్ సేవలు మరింత అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్ఉఐటీ మంత్రిత్వ శాఖ (మీటీ) డిజిటల్ యాక్సెసిబిలిటీ, సమగ్రత అంశాలపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధితో చర్చలు జరిపింది. డిజిటల్ సాంకేతికత అందరికీ సమానంగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వ సేవలు, వెబ్సైట్లు, డిజిటల్ ప్లాట్ఫారమ్లలో యాక్సెసిబిలిటీ ప్రమాణాలను మరింత బలోపేతం చేయడంపై ఈ సమావేశంలో చర్చించారు. డిజిటల్ భారత్లో ఎవరికీ అడ్డంకులు లేకుండా సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు కొనసాగిస్తోంది.

కునోలో నాలుగు చిరుత పిల్లల జననం

బోట్స్వానా ఆడ చిరుతకు ప్రసవం

భారత్లో 62కు చేరిన చిరుతల సంఖ్య

పునరావాస కార్యక్రమానికి మరింత ఊతం

భోపాల్, నవంబర్ 20 (సమయం న్యూస్) : మధ్యప్రదేశ్లోని కునో నేషనల్ పార్క్లో బోట్స్వానా నుంచి తీసుకొచ్చిన ఆడ చిరుత నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. దీంతో భారత్లో చిరుతల సంఖ్య 62కు చేరినట్లు అధికారులు తెలిపారు. దేశంలో చిరుతల పునరావాస కార్యక్రమానికి ఈ పరిణామం మరింత ఊతమిచ్చింది.





కార్బన్ న్యూట్రాలిటీపై ఎన్సీబీ సదస్సు

- గచ్చిబౌలిలో రెండు రోజుల పాటు నిర్వహణ
- 2070 నెట్జీరో లక్ష్యంపై నిపుణుల చర్చలు
- 50 స్టాళ్లతో ప్రత్యేక టెక్నికల్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): సిమెంట్, కాంక్రీట్ రంగంలో కార్బన్ ఉద్గారాలను తగ్గించి నెట్జీరో లక్ష్యాల సాధనపై నేషనల్ కౌన్సిల్ ఫర్ సిమెంట్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్ (ఎన్సీబీ) ఆధ్వర్యంలో రెండు రోజుల సదస్సు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సెంటెనరీ కన్వెన్షన్ సెంటర్లో ప్రారంభమైంది. "సస్టైనబుల్ అండ్ నెట్ జీరో ఫ్యూచర్ వైపు" అనే థీమ్తో నవంబర్ 19ఉ20 తేదీల్లో జరుగుతున్న ఈ సదస్సులో పరిశ్రమ నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, కన్సల్టెంట్లు, టెక్నాలజీ సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నారు. మై హోమ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ (టెక్నికల్) వి.ఎస్. నారంగ్ ముఖ్య అతిథిగా సదస్సును ప్రారంభించారు. సీపబ్ల్యూడీ అదనపు డైరెక్టర్ జనరల్ దేబ్జ్యోతి రాయ్చౌధురి, జేఎన్డబ్ల్యూ సిమెంట్ చీఫ్ సస్టైనబిలిటీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ మనోజ్ రుస్తగి గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఎన్సీబీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎల్.పీ. సింగ్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో ఈ స్థాయిలో ఎన్సీబీ నిర్వహిస్తున్న తొలి సదస్సు ఇదేనన్నారు. 2070 నాటికి నెట్జీరో లక్ష్యాన్ని సాధించేందుకు కార్బన్ క్యాప్చర్, వినియోగం, తక్కువ కార్బన్ సిమెంట్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, యూహెచ్పీసీ వంటి సాంకేతికతలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. దేశంలో సిమెంట్ పరిశ్రమ స్థాపిత సామర్థ్యం సుమారు 720 మిలియన్ టన్నులు కాగా, 1996లో టన్ను సిమెంట్కు 1.12 టన్నులుగా ఉన్న నిర్దిష్ట కార్బన్ ఉద్గారాలు 2026లో 0.560 టన్నులకు తగ్గాయని వి.ఎస్. నారంగ్ తెలిపారు. కార్బన్ క్యాప్చర్ టెక్నాలజీకి మరింత పరిశోధన, డెమో ప్రాజెక్టులు, క్లైమేట్ ఫైనాన్స్ అవసరమన్నారు. సదస్సుతో పాటు నిర్వహిస్తున్న టెక్నికల్ ఎగ్జిబిషన్లో సుమారు 35 ప్రముఖ సంస్థలు 50 స్టాళ్లలో తక్కువ కార్బన్ సిమెంట్, కాంక్రీట్ సాంకేతికతలు, పరికరాలు, ఉత్పత్తులు, పరిష్కారాలను ప్రదర్శిస్తున్నాయి. ఈ సదస్సులో తక్కువ కార్బన్ సిమెంట్లు, ఇంధన సామర్థ్యం, ప్రత్యామ్నాయ ఇంధనాలు, కార్బన్ క్యాప్చర్ఉయుటిలైజేషన్, మినరల్ కార్బొనేషన్, ఐఎస్ 456:2025 ముసాయిదా, 3డీ ప్రింటింగ్ కాంక్రీట్, డిజిటల్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత ఆటోమేషన్ తదితర అంశాలపై చర్చలు జరుగుతున్నాయి.

భవాని మండల దీక్షలు ప్రారంభం

- ఇంద్రకీలాద్రిపై వైభవంగా మాలాధారణ
- మహామండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు
- నవంబర్ 24 వరకు దీక్షల స్వీకరణకు అవకాశం

విజయవాడ, నవంబర్ 20 (సమయం న్యూస్) : ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ భవాని మండల దీక్షలుఉ2026 వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా మహామండపం ఆరో అంతస్తులో శ్రీ భవాని అమ్మవారి ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు వి. శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు కోట ప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉప ప్రధాన అర్చకులు నాగరాజు శాస్త్రి భక్తులకు భవాని దీక్షా మాలాధారణ చేశారు. తొలిరోజే వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు దీక్షలు స్వీకరించారు. నవంబర్ 20 నుంచి 24 వరకు భక్తులు ఇంద్రకీలాద్రిపై మండల దీక్షా మాలాధారణ చేసుకోవచ్చని దేవస్థానం వైదిక కమిటీ తెలిపింది.







శ్రీగిరిలో 23, 24 తేదీల్లో కార్తీక వేడుకలు

- 24న ఉదయం 1108 కలశాలతో అభిషేకం
- సాయంత్రం వైభవంగా కార్తీక దీపోత్సవం
- కరపత్రాలు ఆవిష్కరించిన ఆలూరు ఝాన్సీ రాణి

ఒంగోలు, నవంబర్ 20 (సమయం న్యూస్): స్థానిక కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 23, 24 తేదీల్లో కార్తీక మాస ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస ప్రత్యేక కార్యక్రమాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె ఉత్సవ వివరాలను వెల్లడించారు. ప్రముఖ వైఖానస ఆగమ వేద పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరగనున్నాయని పేర్కొన్నారు.

ఈ నెల 23వ తేదీ సోమవారం సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, ఉక్త హోమం నిర్వహిస్తారు. 24వ తేదీ మంగళవారం కార్తీక పౌర్ణమి నాడు ఉదయం కుంభ పూజ, హోమం, పూర్ణాహుతి అనంతరం ఉదయం 9.30 గంటలకు శ్రీవారికి అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం (1108 కలశాలతో అభిషేకం) కన్నుల పండువగా జరుపుతారు. సాయంత్రం 6.30 గంటలకు భక్తుల సమక్షంలో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తారు. ఈ ప్రత్యేక పూజలు, కలశాభిషేకంలో పాల్గొనదలచిన భక్తులు ముందుగా శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రతినిధులు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





గోవాలో 57వ 'ఇఫీ' ప్రారంభం

తొలిరోజు 'ఫాదర్‌ల్యాండ్' ప్రీమియర్ ప్రదర్శన

నవంబర్ 28 వరకు తొమ్మిది రోజుల చిత్రోత్సవం

భారత్‌ఉపోలాండ్ స్నేహానికి సంస్కృతే పునాది

గోవా, నవంబర్ 20 (సమయం న్యూస్) : 57వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ) గోవాలో ఘనంగా ప్రారంభమైంది. ఆస్కార్ అవార్డు గ్రహీత పావెల్ పావ్లికోవ్‌స్కీ దర్శకత్వం వహించిన 'ఫాదర్‌ల్యాండ్ (ఒయ్‌చిజ్నా)' చిత్రం భారత ప్రీమియర్‌గా తొలిరోజు ప్రదర్శితమైంది. రెండో ప్రపంచ యుద్ధానంతరం సిద్ధాంతపరంగా విభజించబడిన జర్మనీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం కుటుంబ బంధాలు, గుర్తింపు, జ్ఞాపకాలు, స్వదేశంఉ వలస వంటి అంశాలను ఆవిష్కరిస్తుంది. థామస్ మాన్, ఆయన కుమార్తె ఎరికా పాత్రల చుట్టూ కథ సాగుతుంది. "సరిహద్దులు లేని కథలు" అనే ఇఫీ నినాదానికి 'ఫాదర్‌ల్యాండ్' ప్రతిబింబమని చిత్ర నిర్మాత ఈవా పుష్కిన్స్కా పేర్కొన్నారు. భారత్‌ఉపోలాండ్ స్నేహానికి సంస్కృతి బలమైన పునాది అని పోలాండ్ రాయబార కార్యాలయ అధికారి పియోటర్ ఆంటోని స్వితాల్స్కీ అన్నారు. నవంబర్ 20 నుంచి 28 వరకు తొమ్మిది రోజుల పాటు ఇఫీఉ2026 జరగనుంది.

హైదరాబాద్‌లో డ్రైవర్‌లెస్ పోడ్‌కార్లు!

కూకట్‌పల్లిఉనాలెడ్జ్ సిటీ మధ్య 35 కి.మీ. నెట్‌వర్క్

ఎలివేటెడ్ మార్గంలో 64 స్టేషన్ల ప్రతిపాదన

మెట్రో, ఆర్టీసీతో అనుసంధానంపై ప్రభుత్వ పరిశీలన



హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్) : నగర ట్రాఫిక్ రద్దీకి పరిష్కారంగా పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్‌టీఎస్)ను ప్రవేశపెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనను పరిశీలిస్తోంది. తొలి దశలో కూకట్‌పల్లి నుంచి రాయదుర్గం, బయోడైవర్సిటీ జంక్షన్ మీదుగా నాలెడ్జ్ సిటీ వరకు 35 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ మార్గంలో డ్రైవర్‌లెస్ ఎలక్ట్రిక్ పోడ్‌కార్లను నడపాలని యోచిస్తోంది. ఈ మార్గంలో 64 స్టేషన్లను ప్రతిపాదించారు. మెట్రో, ఆర్టీసీతో అనుసంధానం చేస్తూ ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో చివరి దశ ప్రయాణాన్ని సులభతరం చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రణాళిక, సాధ్యాసాధ్యాల పరిశీలన దశలో ఉంది.

యమునా శుద్ధికి రూ.874 కోట్లు

రెండు కొత్త ఎస్టీపీల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం

నదిలోకి మురుగునీరు చేరకుండా కట్టడి

యమునా పునరుజ్జీవనానికి దోహదం



న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్) : యమునా నది కాలుష్యాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.874 కోట్ల వ్యయంతో రెండు కొత్త మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. మురుగునీరు నదిలోకి చేరకుండా అడ్డుకోవడంతో పాటు యమునా పునరుజ్జీవనానికి ఈ ప్రాజెక్టులు దోహదపడనున్నాయి.

క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకోవాలి

- ఈతముక్కలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ భారీ ర్యాలీ
- బాలల హక్కులు, ఓటు ఆవశ్యకతపై నినాదాలు
- విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్ల ప్రదానం





ఒంగోలు, నవంబర్ 20 (సమయం న్యూస్): ప్రపంచ బాలల దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈతముక్కల పట్నంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రకాశం జిల్లా సెక్రెటరీ కొనిజేటి వెంకట శేషారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టణ వీధుల్లో బాలల హక్కులు కాపాడాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, రాజ్యాంగాన్ని గౌరవించాలని, భారత్ మాతాకీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ సాగించారు.

ప్రధానోపాధ్యాయులు చెంచు పున్నయ్య మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని సంరక్షించుకుంటూ రాజ్యాంగాన్ని గౌరవించాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి కొనిజేటి వెంకట శేషారావు మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినీ విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవా భావం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినీ విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.

పుష్కరాల లోగో డిజైన్ పోటీ

- తొలి బహుమతి రూ.లక్ష, ద్వితీయ రూ.50 వేలు
- టాప్ 100 ఎంట్రీలకు ప్రశంసా పత్రాలు
- నవంబర్ 30 సాయంత్రం 5లోగా దరఖాస్తుకు గడువు



హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్) : గోదావరి పుష్కరాలుఉ2027కు అధికారిక లోగో, ట్యాగ్‌లైన్ రూపొందించేందుకు తెలంగాణ ఎండోమెంట్స్ శాఖ లోగో, ట్యాగ్‌లైన్ డిజైన్ పోటీ నిర్వహిస్తోంది. 18 ఏళ్ల పైబడిన వ్యక్తులు, గరిష్ఠంగా ముగ్గురు సభ్యుల బృందాలు ఈ పోటీలో పాల్గొనవచ్చు. లోగోతో పాటు తెలుగు, ఇంగ్లిష్ లేదా రెండు భాషల్లో ట్యాగ్‌లైన్ సమర్పించాలి. గోదావరి నది ప్రాధాన్యత, పుష్కరాల ఆధ్యాత్మికత, సంప్రదాయాలను ప్రతిబింబించేలా డిజైన్ ఉండాలని అధికారులు సూచించారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేలు అందజేస్తారు. టాప్ 100 ఎంట్రీలకు ప్రశంసా పత్రాలు ఇవ్వనున్నారు. ఎంట్రీలను 2026 నవంబర్ 30 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలి. పూర్తి వివరాలు ఎండోమెంట్స్ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

రాజస్థాన్ గ్రామీణ పోరులో కాంగ్రెస్ హవా

- 3,701 పంచాయతీ సమితి, 599 జడ్పీ స్థానాల్లో హస్తం విజయం
- బీజేపీకి 2,181 పంచాయతీ సమితి, 301 జడ్పీ సీట్లు మాత్రమే
- మంత్రి ఝాబర్ సింగ్ ఖర్రా భార్య, ఇద్దరు కుమారులకు ఓటమి
- సీఎం భజన్‌లాల్ శర్మ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ ఆధిక్యం



జైపూర్, నవంబర్ 20 (సమయం న్యూస్) : రాజస్థాన్ గ్రామీణ స్థానిక సంస్థల (పంచాయతీ సమితి, జిల్లా పరిషత్) ఎన్నికల ఓట్ల లెక్కింపులో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ భారీ ఆధిక్యంతో దూసుకుపోయింది. రాష్ట్రంలోని 41 జిల్లాలకు గాను 37 జిల్లాల్లోని 7,543 పంచాయతీ సమితి వార్డులు, 1,275 జిల్లా పరిషత్ వార్డులకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం 7.43 గంటల వరకు వెలువడిన ఫలితాల ప్రకారం.. పంచాయతీ సమితి (ఎంపీటీసీ) స్థానాల్లో కాంగ్రెస్ 3,701 సీట్లు కైవసం చేసుకోగా, అధికార బీజేపీ 2,181 స్థానాలకే పరిమితమైంది. ఆర్ఎల్‌పీ 354, స్వతంత్రులు 341, బీఏపీ 136, సీపీఐ(ఎం) 40, బీఎస్పీ 32 స్థానాల్లో గెలుపొందాయి. ఇక జిల్లా పరిషత్ (జడ్పీటీసీ) స్థానాల్లో కాంగ్రెస్ 599, బీజేపీ 301, సీపీఐ(ఎం) 3, ఆర్ఎల్‌పీ 2, స్వతంత్రులు ఒక స్థానాన్ని దక్కించుకున్నారు.

జైపూర్, చురు, జలోర్‌లో హస్తం పైచేయి

జైపూర్ జిల్లా పరిషత్‌లోని 57 వార్డులకు గాను 52 వార్డుల ఫలితాలు వెలువడగా, కాంగ్రెస్ 38, బీజేపీ 12 స్థానాల్లో గెలుపొందాయి. అలాగే జిల్లాలోని 22 పంచాయతీ సమితుల్లో కాంగ్రెస్ 14 చోట్ల విజయం సాధించగా, బీజేపీ చోము, సాంబార్‌లలో మాత్రమే మెజారిటీ దక్కించుకుంది. సంగనేర్‌లో ఆర్ఎల్‌పీ గెలుపొందగా, 5 సమితుల్లో హంగ్ ఏర్పడింది. చురు జిల్లా పరిషత్‌లోని మొత్తం 39 వార్డుల్లో కాంగ్రెస్ 21 స్థానాలతో అగ్రస్థానంలో నిలవగా, బీజేపీ 17, ఇతరులు ఒక స్థానం గెలుచుకున్నారు. ఈ జిల్లాలో మాజీ మంత్రి రాజేంద్ర రాథోడ్ కుమారుడు పరాక్రమ్ సింగ్ రాథోడ్ (వార్డు 39), కోడలు కనికా సింగ్ (వార్డు 23) బీజేపీ తరఫున విజయం సాధించారు. జలోర్ జిల్లా పరిషత్ వార్డుల్లో కాంగ్రెస్ 31, బీజేపీ 12 స్థానాలు కైవసం చేసుకున్నాయి. భీమ్ పంచాయతీ సమితిలోని 19 వార్డుల్లో కాంగ్రెస్ 12, బీజేపీ 7 స్థానాల్లో గెలిచాయి.

మంత్రి కుటుంబానికి షాక్

సీకర్ జిల్లా అజీత్‌గఢ్ పంచాయతీ సమితి ఎన్నికల్లో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఝాబర్ సింగ్ ఖర్రా కుటుంబానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన భార్య శాంతి దేవి (వార్డు 17లో 57 ఓట్ల తేడాతో), కుమారుడు అజయ్ సింగ్ (వార్డు 20) ఓటమి పాలయ్యారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన మరో కుమారుడు దుర్గా సింగ్ కూడా పరాజయం చెందారు. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ పరిధిలోనూ కాంగ్రెస్ ఆధిక్యం కనబరిచినట్లు తెలుస్తోంది.

నాలుగు జిల్లాల్లో డిసెంబర్ 17న కౌంటింగ్

పంచాయతీ సమితి, జిల్లా పరిషత్ సభ్యుల తుది ఫలితాలు వెలువడిన తర్వాత గెలుపొందిన సభ్యులు పంచాయతీ సమితి అధ్యక్షులను (ప్రధాన్), జిల్లా పరిషత్ అధ్యక్షులను (జిల్లా ప్రముఖ్) ఎన్నుకుంటారు. కాగా కోట, బరన్, కరౌలి, శ్రీగంగానగర్ జిల్లాల ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం డిసెంబర్ 22తో ముగియనున్న నేపథ్యంలో, ఆ నాలుగు జిల్లాల ఓట్ల లెక్కింపును డిసెంబర్ 17న నిర్వహించనున్నారు.

దౌత్యంలో భారత్ ప్రేక్షక పాత్ర: రాహుల్

హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్) : అంతర్జాతీయ దౌత్య వ్యవహారాల్లో భారత్ ప్రభావం క్రమంగా తగ్గిపోతోందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. బుధవారం చికాగో యూనివర్సిటీలో విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల మధ్య కీలక చర్చలు జరుగుతున్నప్పుడు భారత్ క్రియాశీల పాత్ర పోషించలేకపోతోందని, అంతర్జాతీయ వేదికపై పక్కకు నెట్టబడుతోందని వ్యాఖ్యానించారు. అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధానికి ముగింపు పలికేందుకు పాకిస్తాన్ చొరవ చూపుతుండగా.. భారత్ ప్రేక్షక పాత్రకే పరిమితం కావడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. గతంలో అంతర్జాతీయ పరిణామాలపై భారత్‌కు స్పష్టమైన అవగాహన ఉండేదని, ప్రపంచ నిర్ణయాలు, దౌత్య చర్చల్లో కీలకంగా వ్యవహరించేదని రాహుల్ గుర్తుచేశారు. ప్రస్తుతం అలాంటి ప్రభావం కనిపించడం లేదని పేర్కొన్నారు. అమెరికా, రష్యా, ఇరాన్ వంటి దేశాలతో భారత్‌కు సంబంధాలున్నప్పటికీ వాటిని అంతర్జాతీయ దౌత్యంలో సమర్థంగా వినియోగించుకోలేకపోతోందని విమర్శిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై ప్రశ్నలు సంధించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లతో వ్యక్తిగత సాన్నిహిత్యం పెంచుకోవడం వల్ల దేశాల మధ్య సంబంధాలు బలోపేతం కావని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సంబంధాలపై నాయకుల వ్యక్తిగత స్నేహాల కంటే ఆర్థిక ప్రయోజనాలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులే అధిక ప్రభావం చూపుతాయని రాహుల్ పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎదురుదాడి

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. విదేశీ వేదికలపై భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఆయన మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ స్పందిస్తూ రాహుల్‌ను 'పాకిస్తాన్ ఫ్యాన్ బాయ్'గా అభివర్ణించారు. మరో అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ మాట్లాడుతూ.. రాహుల్ వ్యాఖ్యలు క్షమించరానివని, ఆయన పాకిస్తాన్‌కు అనుకూలంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అంతర్జాతీయంగా భారత్ సాధిస్తున్న గుర్తింపును కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు.



రక్షిత సంచలనం

ఒలింపిక్ చాంప్ చెన్ యుఫీపై గెలుపు

సాత్విక్ జోడీ, సేన్ ముందంజ

కౌలూన్ (హాంకాంగ్): భారత యువ షట్లర్ రక్షితశ్రీ రామ్‌రాజ్ హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలనం సృష్టించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో 19 ఏండ్ల రక్షిత 21-18, 24-22తో ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ అయిన చెన్ యుఫీపై గెలిచి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయం సాధించింది. తొలిరౌండ్‌లో బ్లిచ్‌ఫీల్డ్‌ను చిత్తుచేసిన ఈ కోయంబత్తూర్ అమ్మాయి.. క్వార్టర్స్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన చౌచువాంగ్‌తో తలపడనుంది. ఇక మెన్స్ సింగిల్స్‌లో ఇప్పటికే వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో చోటు దక్కించుకున్న లక్ష్యసేన్.. 21-11, 21-18తో రస్మస్ గెమ్కె (డెన్మార్క్)ను చిత్తుచేసి క్వార్టర్ ఫైనల్‌కు ప్రవేశించాడు. మరో మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ 12-21, 21-18, 21-14తో యు టే బిన్ (సౌత్‌కొరియా)ను ఓడించాడు. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 21-19, 21-16తో అజ్రియాన్-కియోంగ్ (మలేషియా) జోడీపై గెలిచి క్వార్టర్స్ చేరింది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ జంట 20-22, 13-21తో లారెన్ లామ్-అలిసన్ లీ (అమెరికా) చేతిలో ఓడి ప్రిక్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది.



ఏ క్రికెటర్‌పైనా గంభీర్‌కు కోపం లేదు

కోచ్ సంజయ్ భరద్వాజ్

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్): మహమ్మద్ సిరాజ్ ముస్లిం కావడం వల్లే న్యూజిల్యాండ్‌తో మొదటి టెస్టు మ్యాచ్‌లో అతడిని దూరం పెట్టారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యలపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చిన్ననాటి కోచ్ సంజయ్ భరద్వాజ్ స్పందించారు. సిరాజ్‌ను పక్కన పెట్టడం వెనుక మతానికి సంబంధించి ఎలాంటి కోణం లేదని ఆయన అన్నారు. శుక్రవారం ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడారు. సిరాజ్ విషయంలో హిందూ ముస్లిం కోణం లేదన్నారు. జట్టు అవసరాలు, కాంబినేషన్‌ను దృష్టిలో ఉంచుకొని టీం సెలెక్షన్ ఉంటుందన్నారు. సిరాజ్‌కు గంభీర్ ఎప్పుడూ అండగా నిలిచాడని, ఏ ఆటగాడిపైనా అతనికి కోపం లేదన్నారు. బలమైన జట్టు నిర్మాణమే హెడ్ కోచ్ ప్రాధాన్యమని పేర్కొన్నారు. 'సిరాజ్ విషయంలో వస్తున్న వార్తలన్నీ నిరాధారం. జట్టులో ప్రతిఒక్కరూ ఇండియనే. వారంతా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. సిరాజ్‌కు గంభీర్ ఎప్పుడూ సపోర్ట్‌గా ఉన్నాడు. జట్టు పరిస్థితి, ఆటగాళ్ల ప్రదర్శనల ఆధారంగా ఎంపిక ఉంటుంది' అని భరద్వాజ్ వ్యాఖ్యానించారు. అలాగే, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కూడా జట్టు యాజమాన్యం నిర్ణయాన్ని సమర్థించాడు. కాగా.. సిరాజ్ ముస్లిం అయినందువల్లే అతడిని పక్కన పెట్టారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ అంతకుముందు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న వరల్డ్ టస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత ఆటగాడు సిరాజ్‌ను న్యూజిల్యాండ్‌తో మొదటి టెస్టుకు దూరం పెట్టడంపై జట్టు యాజమాన్యంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

శ్రీలంకపై పాకిస్థాన్ ఘన విజయం!



- రెండో టెస్టులో ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు
- రెండేళ్ల తర్వాత టెస్టు సిరీస్ కైవసం

రావల్పిండి/హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): రెండో టెస్ట్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 8 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపొందింది. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో ఎదురైన గందరగోళం, కొందరు ఆటగాళ్లను పర్యటన మధ్యలోనే తొలగించడం వంటి ఇబ్బందుల తర్వాత పాకిస్తాన్‌కు ఇది ఎంతో ప్రత్యేకమైన విజయం. ఈ గెలుపుతో పాకిస్తాన్ జట్టు రెండేళ్ల తర్వాత తొలి టెస్ట్ సిరీస్‌ను 1-0 తేడాతో సొంతం చేసుకుంది. అంతకుముందు పాకిస్తాన్ 2024లో ఇంగ్లాండ్‌పై టెస్ట్ సిరీస్ గెలిచింది. రావల్పిండిలో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు ఉదయం 90 పరుగుల లక్ష్యాన్ని పాకిస్తాన్ కేవలం 13 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. అజాన్ అవైస్ 32 పరుగులతో, ఆల్‌రౌండర్ ఆమిర్ జమాల్ 22 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 34 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 98 పరుగులకు ఆలౌట్ కాగా, పాకిస్తాన్ 325 పరుగులు చేసి 227 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక 316 పరుగులు చేసి 89 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని మాత్రమే ఇవ్వగలిగింది.

ఘన విజయంతో మొదలు

మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత్ శుభారంభం



భోపాల్: మహిళల హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో నాలుగో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగిన ఆతిథ్య భారత్ ఘన విజయంతో టోర్నీని ప్రారంభించింది. గురువారం జరిగి తొలి మ్యాచ్‌లో 4-1తో మలేషియాను చిత్తు చేసింది. తొలి క్వార్టర్‌లో ఇరుజట్లూ గోల్ కొట్టలేకపోయినా రెండో క్వార్టర్ నుంచి జోరందుకున్న భారత్ ఆ తర్వాత ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగింది. ఆతిథ్య జట్టు నుంచి ముంతాజ్ ఖాన్ (19వ నిమిషంలో), సలీమ టెటె (35), పూజా సాహు (39), లాల్‌రెమ్‌సియామి (49) గోల్స్ చేశారు. మలేషియా ప్లేయర్లలో నురామిరా జుల్కిఫ్లి (19) ఏకైక గోల్ చేసింది. ఈ టోర్నీలో తదుపరి మ్యాచ్‌ను భారత్.. శనివారం కొరియాతో ఆడనుంది.

నేపాల్‌ను చిత్తుచేసిన భారత్

- 306 పరుగులతో ఘన విజయం!
- 26 పరుగులకే నేపాల్ కుప్పకూలింది



దోహా, నవంబర్ 20 (సమయం న్యూస్): ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ పోటీల్లో భారత్-ఎ జట్టు అద్భుత విజయంతో శుభారంభం చేసింది. నేపాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఏకంగా 306 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 333 పరుగుల లక్ష్య ఛేదనలో నేపాల్ కేవలం 26 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్ల ధాటికి ప్రత్యర్థి జట్టు 11.3 ఓవర్లలోనే చేతులెత్తేసింది. ప్రిన్స్ యాదవ్ ఐదు వికెట్లు, హర్షిత్ రాణా నాలుగు వికెట్లు పడగొట్టి నేపాల్ పతనాన్ని శాసించారు. షాబాజ్ అహ్మద్ ఒక వికెట్ సాధించాడు. నేపాల్ తరఫున పవన్ సరాఫ్, రషీద్ ఖాన్ చెరో ఆరు పరుగులతో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లుగా నిలిచారు. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఎ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 332 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును సారథి తిలక్ వర్మ, కుమార్ కుశాగ్ర ఆదుకున్నారు. తిలక్ వర్మ 113 బంతుల్లో ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 107 పరుగులు చేయగా, కుశాగ్ర 102 బంతుల్లో పది ఫోర్లు, ఐదు సిక్సర్లతో 117 పరుగులు సాధించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 206 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు. చివర్లో సూర్యాంశ్ షెడ్గే కేవలం 14 బంతుల్లో నాలుగు సిక్సర్లతో అజేయంగా 36 పరుగులు చేసి భారత స్కోరును 332కు చేర్చాడు. నేపాల్ బౌలర్లలో సందీప్ లామిచానే, లలిత్ రాజ్‌బన్షీ చెరో మూడు వికెట్లు సాధించారు. అనంతరం భారత వేగవంతమైన బౌలర్లను ఎదుర్కోలేక నేపాల్ బ్యాటర్లు వరుసగా వెనుదిరిగారు. కేవలం 17 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన నేపాల్ చివరకు 26 పరుగులకే ఆలౌటైంది. బ్యాటింగ్‌లో తిలక్, కుశాగ్ర శతకాలు.. బౌలింగ్‌లో ప్రిన్స్, హర్షిత్ అద్భుత ప్రదర్శనతో భారత్ చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది.

ఆడకుండానే పాక్‌కు ఆసియా కప్

- నిరసనగా భారత్ బహిష్కరణ!
- వర్షంతో రద్దయిన అంధుల ఆసియా కప్ ఫైనల్



ఢాకా, నవంబర్ 20 (సమయం న్యూస్): మైదానంలో తలపడకుండానే భారత్ - పాకిస్థాన్ మధ్య అంధుల ఆసియా కప్ విజేత ఎవరో తేలిపోయింది. వర్షం కారణంగా ఫైనల్ మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దవడంతో పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటించారు. ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన భారత అంధుల క్రికెట్ జట్టు ట్రోఫీ ప్రదానోత్సవాన్ని బహిష్కరించింది. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో శుక్రవారం పురుషుల బ్లైండ్ ఆసియా కప్ ఫైనల్ జరగాల్సి ఉంది. అయితే ఎడతెరిపి లేని వర్షంతో టాస్ కూడా సాధ్యం కాలేదు. దీంతో లీగ్ దశలో మెరుగైన నెట్ రన్‌రేట్ ఆధారంగా పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని భారత క్రికెట్ సంఘం ఫర్ ది బ్లైండ్ (సీఏబీఐ) తీవ్రంగా వ్యతిరేకించింది. టోర్నీ నిబంధనల ప్రకారం భారత్, పాకిస్థాన్‌లను ఉమ్మడి విజేతలుగా ప్రకటించాల్సి ఉందని సీఏబీఐ వాదించింది. ఈ అంశంపై వరల్డ్ బ్లైండ్ క్రికెట్ కౌన్సిల్ సాంకేతిక కమిటీ తొలుత అంగీకరించినప్పటికీ.. ఆ తర్వాత నిర్ణయం మారిందని ఆరోపించింది. నిబంధనల్లో లేని విధంగా నెట్ రన్‌రేట్‌తో విజేతను నిర్ణయించడం అన్యాయమని పేర్కొంది. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు భవిష్యత్తులో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లు ఆడకూడదని భారత అంధుల జట్టు భావిస్తున్నట్లు సీఏబీఐ కార్యదర్శి శైలేంద్ర వెల్లడించారు. భారత జట్టు అధ్యక్షుడు మహంతేశ్ జీకే సైతం ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మైదానంలో ఆడి గెలిస్తే పాక్ విజయాన్ని అంగీకరించేవాళ్లమని, ఇలా ఏకపక్షంగా విజేతగా ప్రకటించడాన్ని మాత్రం ఒప్పుకోబోమని స్పష్టం చేశారు.



తొలి సినిమా రిలీజ్ రోజే జాక్‌పాట్..

నాగచైతన్య సరసన ఛాన్స్ కొట్టేసిన యంగ్ బ్యూటీ సాత్విక వీరవల్లి!

హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): తొలి సినిమా ఫలితం తెలియకముందే వరుస అవకాశాలు దక్కించుకుంటూ యువ నటి సాత్వికా వీరవల్లి తెలుగు చిత్ర పరిశ్రమలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కిన 'ఆకాశంలో ఒక తార' చిత్రంతో వెండితెరకు పరిచయమవుతున్న సాత్వికకు మరో భారీ అవకాశం దక్కింది. అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మించనున్న కొత్త చిత్రంలో ఆమెను కథానాయికగా ఎంపిక చేసినట్లు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ వెల్లడించారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసిన సాత్వికా వీరవల్లి సినిమాలపై ఆసక్తితో ఉద్యోగాన్ని వదిలి భారత్‌కు తిరిగివచ్చారు. 'ఆకాశంలో ఒక తార' చిత్రంతో నటిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ చిత్ర ప్రచార కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడుతూ సాత్విక నటనను ప్రత్యేకంగా ప్రశంసించారు. చిత్రీకరణ పూర్తయిన తర్వాత సన్నివేశాలను పరిశీలించినప్పుడు ఆమె నటన తనను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. కొత్త నటే అయినప్పటికీ అనుభవం ఉన్న కథానాయికలా నటించడంతో తమ సంస్థ నిర్మించే తదుపరి చిత్రానికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. నాగచైతన్య సరసన సాత్విక నటించనున్న విషయాన్ని అల్లు అరవింద్ వెల్లడించడంతో దుల్కర్ సల్మాన్ కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. తొలి చిత్రం విడుదలవుతున్న సమయంలోనే మరో ప్రముఖ కథానాయకుడితో నటించే అవకాశం దక్కడం విశేషంగా మారింది. ఈ చిత్ర దర్శకుడు, చిత్రీకరణ ప్రారంభానికి సంబంధించిన వివరాలు ఇంకా వెల్లడికాలేదు. మరోవైపు సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించనున్న 'ఆర్సీ 17' చిత్రంలోనూ సాత్వికను కథానాయికగా పరిశీలిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తొలి చిత్రంతోనే ప్రముఖ దర్శకనిర్మాతల దృష్టిని ఆకర్షించిన సాత్విక భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు అందుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తమ నటుడు రణ్‌వీర్.. 'ధురంధర్'కు అవార్డుల మోత



- దాదాసాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవ పురస్కారాల ప్రకటన
- ఉత్తమ చిత్రం, దర్శకుడు సహా పలు విభాగాల్లో 'ధురంధర్' హవా
- 'సయారా' చిత్రానికి ఉత్తమ నటిగా అనీత్ పడ్డా
- అంతర్జాతీయ కళాకారిణిగా టేలర్ స్విఫ్ట్‌కు గౌరవం
- కమల్‌హాసన్, ఇళయరాజాలకు విశిష్ట పురస్కారాలు



ముంబై నవంబర్ 20 (సమయం న్యూస్): దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 అవార్డులను శుక్రవారం ప్రకటించారు. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' అవార్డుల మోత మోగించింది. ఉత్తమ నటుడి అవార్డు రణవీర్ సింగ్‌ను వరించింది. ఇక 'సయారా'లో నటనకు గానూ ఉత్తమ నటి అవార్డును అనీత్ పడ్డా సొంతం చేసుకుంది. ఉత్తమ చిత్రంగా 'ధురంధర్' నిలిచింది. ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ప్రముఖ గాయని టేలర్ స్విఫ్ట్ ఎంపికయ్యారు. సంగీత ప్రతిభ, పాటల రచనా నైపుణ్యం, అంతర్జాతీయ సాంస్కృతిక ప్రభావం, లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి ఆమె అందించిన సేవలను గుర్తిస్తూ టేలర్ స్విఫ్ట్‌కు ఈ పురస్కారాన్ని కమిటీ ప్రకటించింది. దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ద్వారా భారతీయ సినిమా, వినోద రంగానికి చెందిన ప్రతిభావంతులను గుర్తించి అవార్డుతో సత్కరిస్తున్నారు. భారతీయ సినిమా పితామహుడిగా ప్రసిద్ధి చెందిన దాదాసాహెబ్ ఫాల్కే పేరు మీద ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. సినీ నిర్మాణం, కళలు, వినోద రంగాలకు సంబంధించిన వివిధ విభాగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ వేదికపై పురస్కారాలను అందిస్తున్నారు.

ఫాల్కే అవార్డు విజేతలు వీళ్లే

ఉత్తమ చిత్రం: ధురంధర్
ఉత్తమ నటుడు: రణ్‌వీర్ సింగ్ (ధురంధర్)
ఉత్తమ నటి: అనీత్ పడ్డా (సయారా)
ఉత్తమ దర్శకుడు: ఆదిత్య ధర్ (ధురంధర్)
ఉత్తమ సహాయ నటుడు: వినీత్ కుమార్ సింగ్ (ఛావా)
ఉత్తమ ప్రతినాయకుడు: అక్షయ్ ఖన్నా (ధురంధర్)
హాస్య ప్రధాన పాత్రలో ఉత్తమ నటుడు: రితేశ్ దేశ్‌ముఖ్ (హౌస్‌ఫుల్5)
ఉత్తమ సంగీత దర్శకుడు: శాశ్వత్ సచ్‌దేవ్ (ధురంధర్)
క్రిటిక్స్ బెస్ట్ ఫిల్మ్: కాంతార: చాప్టర్1
క్రిటిక్స్ బెస్ట్ యాక్టర్: రిషబ్‌శెట్టి (కాంతార: చాప్టర్1)
క్రిటిక్స్ బెస్ట్ యాక్టర్: యామి గౌతమ్‌ధర్ (హక్)
ప్రాడ్యూసర్ ఆఫ్ ది ఇయర్: ఆదిత్యధర్, జ్యోతి దేశ్‌పాండే, లోకేశ్‌ధర్: ధురంధర్
ఉత్తమ కొరియోగ్రఫీ: శాండీ మాస్టర్ (కూలీ-మోనికా బెలూసీ)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: అరవింద్ ఎస్.కశ్యప్ (కాంతార: చాప్టర్1)
ఉత్తమ్ స్క్రీన్‌ప్లే అండ్ డైలాగ్: లీషు నాథ్ (హక్)
ఉత్తమ గేయ రచయిత: ఇర్షద్ కమిల్ (సయారా)
ఉత్తమ నేపథ్య గాయకుడు: ఫహీమ్ అబ్దుల్లా (సయారా)
ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్: కరణ్ ఆజ్లా
సాంగ్ ఆఫ్ ది ఇయర్: సయారా
కమెడియన్ ఆఫ్ ది ఇయర్: సామే రైనా
అవుట్‌స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ మ్యూజిక్ ఇండస్ట్రీ: ఇళయరాజా
అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ ఫిల్మ్ ఇండస్ట్రీ: కమల్‌హాసన్

ఉత్తమ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్: అవతార్: ఫైర్ అండ్ యాష్
ఉత్తమ దర్శకుడు (ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్): వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
ఉత్తమ నటుడు (ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్): మైకేల్ బి.జోర్డాన్ (సిన్నర్స్)
ఉత్తమ నటి (ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్): జెస్సీ బక్లే (హ్యామ్‌నెట్)
అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ గ్లోబల్ సినిమా: జేమ్స్ కామెరూన్
ఉత్తమ లఘు చిత్రం: మాధురి - ఎండ్ ఈజ్ బిగినింగ్ (సయీద్ షాహిద్ ఖాన్)
ఉత్తమ లఘు చిత్రం (ద్వితీయ) - జహాన్ - ది లాస్ట్ గిఫ్ట్ (రాహుల్ శెట్టి)
ఉత్తమ షార్ట్ ఫిల్మ్ (సెకండ్ రన్నరప్) - ఇన్ హాఫ్ (జోర్జే మోరిస్)
ఉత్తమ షార్ట్ ఫిల్మ్ (థర్డ్ రన్నరప్) - టీ కొట్టు 83 (సాయి హరిణి వసంత్)

ఓటీటీ విజేతలు వీళ్లే

ఉత్తమ వెబ్‌సిరీస్: ది బ్యాలిలి డ్స్‌ఆఫ్ బాలీవుడ్
ఉత్తమ దర్శకుడు: ఆర్యన్‌ఖాన్ (ది బ్యాలిలి డ్స్‌ఆఫ్ బాలీవుడ్)
ఉత్తమ నటుడు: జైదీప్ అహ్లావత్ (పాతాళ్ లోక్: సీజన్2)
ఉత్తమ నటి: షెఫాలీ షా (దిల్లీ క్రైమ్ సీజన్3)
ఉత్తమ సహాయ నటుడు: వినయ్ పాఠక్ (గ్రామ్ చికిత్సాలయ)
ఉత్తమ ప్రతినాయకురాలు: హ్యుమా ఖురేషి (దిల్లీ క్రైమ్ సీజన్3)
టెలివిజన్ సిరీస్ ఆఫ్ ది ఇయర్: తారక్ మెహతా కా ఉల్టా ఛష్మా
ఉత్తమ నటుడు (టెలివిజన్ సిరీస్): అమర్ ఉపాధ్యాయ్ (క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ 2)
ఉత్తమ నటి (టెలివిజన్ సిరీస్): స్మృతి ఇరానీ (క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ 2)







వెంకటేష్- కల్యాణ్ రామ్ 'జనవరి 12 విడుదల'

'దివ్వికి దివ్వికి' సాంగ్ ప్రోమోతో ప్రమోషన్లు షురూ!



హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'జనవరి 12 విడుదల'. సంక్రాంతి కానుకగా 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఘనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా సినిమాలోని తొలి పాట 'దివ్వికి దివ్వికి' సాంగ్ ప్రోమోను తాజాగా విడుదల చేశారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా, ఈ పాటతో మ్యూజికల్ మ్యాజిక్ ఖాయమని చిత్రబృందం పోస్ట్‌లలో ఆసక్తిని రేకెత్తించింది. వెంకటేష్, కల్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న తొలి సినిమా కావడంతో 'జనవరి 12 విడుదల'పై ఆరంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, జీ స్టూడియోస్ సౌత్, జీ మ్యూజిక్ సౌత్ వంటి ప్రముఖ సంస్థలు ఈ ప్రాజెక్ట్‌తో అనుసంధానమై ఉన్నాయి.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**